విద్యార్థులకు 'అపార'మైన మేలు

విశిష్ట ఖాతా నంబరు కేటాయింపు

జిల్లాలో చురుగ్గా నమోదు ప్రక్రియ



పాయకరావుపేట, నక్కపల్లి, న్యూస్‌టుడే

'ఒకే దేశం.. విద్యార్థికి ఒక గుర్తింపు' పేరిట కేంద్రం ప్రవేశపెట్టిన 'అపార్' (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంటింగ్ రిజిస్ట్రీ) కార్యక్రమం జిల్లాలో చురుగ్గా సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో విద్యాశాఖ అధికారులు ఈ ప్రక్రియను వేగవంతం చేశారు.

దేశంలో ప్రజలకు శాశ్వత గుర్తింపు కింద ఆధార్ ఉంది. కాగా విద్యార్థులకు ఇదే తరహాలో 12 నంబర్లతో కూడిన ఓ విశిష్ట సంఖ్యతో కూడిన గుర్తింపు డిజిటల్ లాకర్ అందించాలనే ఆలోచనతోనే 2020 జాతీయ విద్యా విధానం కింద అపార్‌ను అమలులోకి తెచ్చారు. కాగా గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇది అమలు కాలేదు. ప్రస్తుతం అధికారులు దీనిని అమలు చేసేపనిలో పడ్డారు. విద్యార్థుల ధ్రువపత్రాలతో పాటు, వారి భవితకు ఇతర అంశాలతో కూడిన సమగ్ర సమాచారాన్ని డిజి లాకర్‌లోనే నిక్షిప్తం చేయనున్నారు. ఈ క్రమంలో తొలి విడతలో తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు దీన్ని అమలు చేస్తున్నారు. ఇందుకోసం వారి తల్లిదండ్రుల నుంచి అనుమతి పత్రాలను తీసుకుంటున్నారు. ఆ మేరకు విద్యాశాఖ రూపొందించిన దరఖాస్తులను వారికి పంపించి సంతకాలు తీసుకుంటున్నారు. దీనిని ఈనెల 14 నుంచి మొదలు పెట్టారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు రావడంతో ప్రభుత్వ/ప్రైవేటు యాజమాన్యాలన్నీ దీనిపైనే దృష్టి సారించాయి. జిల్లాలో తొమ్మిది, పది తరగతుల విద్యార్థులు సుమారు 42,500 మంది ఉన్నారు. వీరి వివరాలను ప్రభుత్వం పరిశీలించి వారికి డిజిటల్ లాకర్ కేటాయిస్తుంది. ఇందులో పది మొదలుకుని, పీజీ ఆపైన చదువులు చేసిన తాలూకా ధ్రువపత్రాలన్నీ భద్రపరచనున్నారు. ప్రస్తుతం చేతికి ఇస్తున్న ధ్రువపత్రాలతోపాటు ఇందులోనూ ఇవి ఉంటాయి. మరోవైపు దీని నమోదులో క్షేత్రస్థాయిలో కొన్ని సమస్యలుండటంతో ప్రక్రియలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థికి సంబంధించి పేరు, పుట్టిన తేదీ, ఇతర వివరాలు ఆధార్, అడ్మిషన్ రిజిస్టర్ యు డైస్‌లో ఒకేలా ఉండాలి. చాలామందికి తేడాలుండటంతో వారి వివరాలు నమోదు కావడంలేదు. ఈ సమస్యలు పరిష్కారమైతే ప్రక్రియ మరింత వేగవంతం కానుంది.



విద్యార్థి వివరాలు ఆన్‌లైన్ చేస్తున్న ఉపాధ్యాయులు

ఇవీ లాభాలు

- ఇది శాశ్వత గుర్తింపు సంఖ్య.
- విద్యార్థులను ఒక పాఠశాలనుంచి మరో పాఠశాలకు లేదా, ఇతర ప్రాంతాల్లోని పాఠశాలలకు బదిలీ చేయడానికి సులువు అవుతుంది.
- విద్యార్థికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఉండటం వల్ల విద్యార్థి సాధికారికత పెంపొందుతుంది.
- విద్యా, క్రీడా ఇతర రంగాల్లో సాధించిన ప్రగతి ఇందులో నిక్షిప్తమవుతుంది. అవసరమైనప్పుడు ఈ సమాచారం వెంటనే తెలుసుకోవచ్చు.
- విద్యార్థుల పరీక్ష ఫలితాలు, ప్రగతి నివేదిక, ఆరోగ్య నివేదిక, బోధనభ్యసన సామర్థ్యం, విద్యేతర సంబంధిత విషయాల్లో సాధించిన ప్రగతి ఇందులో ఉంటుంది.
- ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు అవసరమైన ధ్రువపత్రాలను సులభతరంగా అందించొచ్చు.
- ఉన్నత విద్యకు సంబంధించి క్రెడిట్ స్కోర్ నమోదుకు ఉపయోగపడుతుంది.
- పోటీ పరీక్షలు, ఉపకార వేతనాలు, ప్రభుత్వ పథకాలు తదితర విషయాల్లో అవసరమైన సమాచారం అపార్ ఎంతగానో ఉపయోగపడుతుంది.
- విద్యార్థి సమగ్ర యోగ్యత మొత్తం అపార్‌లోనే ఉంటుంది.

కొందరు డ్రాపవుట్ విద్యార్థులు వేరొక ప్రాంతంలో చేరుతుంటారు. ఈ విశిష్ట సంఖ్య ఆధారంగా వారి చదువుగురించి తెలుసుకునే వీలుంటుంది.

చాలా మంచి కార్యక్రమం



ఉన్నతాధికారుల ఆదేశాలతో విద్యార్థుల సమాచారం ఆన్‌లైన్ చేస్తున్నాం. దీనికనుగుణంగా విద్యార్థులు తమ వివరాలను పక్కాగా సమర్పించాలి. క్షేత్రస్థాయిలో ప్రస్తుతం కొన్ని ఇబ్బందులున్నాయి. ప్రధానంగా ఆధార్‌కు, పాఠశాల రికార్డులు, 'యు' డైస్‌లో వేర్వేరు వివరాలు ఉంటున్నాయి. ఇలాంటి వివరాలు ఆన్‌లైన్ కావడంలేదు. దీనిని సరిచేయడానికి విద్యార్థులు, ఉపాధ్యాయులకు తగిన గడువు ఇస్తే కార్యక్రమం పక్కాగా సాగుతుంది. అపార్ అనేది చాలా మంచి కార్యక్రమం. – కోడి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు, పెదరామభద్రపురం

భవిష్యత్తులో ఇదే కీలకం



ప్రస్తుతం తొమ్మిది, పది తరగతుల విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు. ఇందుకోసం ఉపాధ్యాయులకు తగిన సూచనలిచ్చాం. జిల్లాలో ఉపాధ్యాయులు బాగా పనిచేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో తొలి మూడు స్థానాల్లో మన జిల్లా ఉంది. దీనిని త్వరితగతిన పూర్తి చేయాలనే లక్ష్యం పెట్టుకున్నాం. సాంకేతిక కారణాలతో ఆన్‌లైన్ కాని వివరాలను వదిలి, మిగిలినవి నమోదు చేయాలి. భవిష్యత్తులో దశలవారీగా అన్ని తరగతులకు దీనిని అమలు చేయనున్నారు. అపార్ అనేది విద్యార్థి జీవితానికి ఎంతో ఉపయోగకరం. భవిష్యత్తులో ఇదే కీలకం కానుంది. – ఎం.వెంకటలక్ష్మమ్మ, డీఈఓ

రెండు చుక్కలతో చెక్ పెట్టేద్దాం!



అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

పోలియోను దేశం నుంచి తరిమేయాలని చేపట్టిన ప్రచారం మంచి ఫలితాన్ని ఇచ్చింది. దేశవ్యాప్తంగా పోలియో కేసులు సున్నాకు చేరడంతో పోలియోరహిత దేశంగా ప్రకటించాలనుకుంటున్న సమయంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లో కేసులు రావడం భయాందోళనలు కలిగించింది. ఈ నేపథ్యంలో మిషన్ ఇంద్రధనస్సు పేరుతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సర్వే చేపట్టింది. జిల్లాలో నవంబరు 1 నుంచి 15వ తేదీ లోగా ఈ ఇంటింటా సర్వే ప్రారంభం కానుంది.

నేడు వరల్డ్ పోలియో డే



పోలియో మహమ్మారి ఒకప్పుడు అందరినీ వేధించేది. అంగవైకల్యానికి దారితీసే ఈ వైరస్‌ను నిర్మూలించడానికి పోలియో చుక్కలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చి అందరికీ ఉచితంగా అందించింది. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు వరకు ఏడాదిలో రెండు విడతల్లో పోలియో చుక్కలను వేసేలా వైద్య సిబ్బంది ప్రత్యేక చొరవ చూపుతున్నారు. జిల్లా, ఏరియా ఆసుపత్రులతో పాటు సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల వైద్య సిబ్బంది సహకారంతో పోలియోను సమూలంగా నిర్మూలించేలా ప్రభుత్వం, వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుంది.

ఇదీ పరిస్థితి..

ఏడాది	అయిదేళ్ల లోపు చిన్నారులు	చుక్కలు వేసింది	శాతం
2022	1,67,437	1,67,124	99.81
2023	1,81,510	1,82,414	100.50
2024	1,97,701	1,97,810	100.06

సముద్ర తీర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి.. పొరుగు దేశాల్లో పోలియో కేసులు రావడంతో మన దేశంలోని తీర ప్రాంతాల్లో నివసించే జనవాసాలపై దృష్టి సారిస్తున్నారు. చిన్న పిల్లలకు జ్వరం, వాంతులతో పాటు నడవడానికి ఇబ్బందులు పడుతున్న వారు ఎవరైనా ఉన్నారా అన్నదానిపై నెలవారీ సర్వే జరుగుతోంది. టీకాల అధికారుల సమక్షంలో పరిశీలన చేస్తున్నారు. గత 15 ఏళ్లగా పోలియో కేసులు నమోదు కావడం లేదని వైద్యాధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఎవరికైనా పోలియో చుక్కలు వేయలేదా అన్నదానిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కార్మికుల పిల్లల్లో అయిదేళ్లలోపు ఉన్న వారిని కూడా గుర్తించి వారికి కూడా చుక్కల మందు వేయడం వల్ల లక్ష్యాలకు మించే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.



కృష్ణదేవిపేటలో పోలియో చుక్కలు వేయడానికి నీటిలో వెళ్తున్న ఉద్యోగిని

అందరి సహకారంతో నిర్మూలన:



అందరి సహకారంతో పోలియోను నిర్మూలించగలిగాం. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు వరకు పోలియో చుక్కలతో పాటుగా టీకాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయి. గత 15 ఏళ్లుగా పోలియో కేసులు లేవు. మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా నవంబరు 1 నుంచి 15 వరకు జిల్లాలో సర్వే చేపడుతున్నాం. ఎక్కడైనా పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులు ఉంటే గుర్తించి, వారికీ వేస్తాం. – డాక్టర్ చంద్రశేఖర్ దేవ్, జిల్లా టీకాల అధికారి

ఆకలి తీర్చే అమ్మ.. గోమాతకు వందనమమ్మ



నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే

ఆ పందిపిల్ల ఆకలిమీద ఉంది. ఆకలి తీర్చుకునే మార్గం కోసం వెదుకుతున్న దానికి రోడ్డుమీద పడుకున్న ఆవు కనిపించడంతో పొదుగు దగ్గరకు వెళ్లి పాలు తాగడం మొదలెట్టింది. ఎంతైనా తల్లి మనసు కదా... జాతి ఏదైనా కావచ్చు... ఆకలి అందరికీ ఒకటే కదా అనుకుందో ఏమో గాని పందిపిల్ల పాలు తాగుతున్నంతసేపూ గోమాత సహకరించింది. నర్సీపట్నంలో బాల వినాయకుడి గుడి వద్ద బుధవారం కనిపించిన దృశ్యమిది..

జిల్లాలో 3.50 లక్షల సభ్యత్వాలు



సమావేశంలో తాతయ్య బాబు, కాశీనాయుడు తదితరులు

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి పార్లమెంటు పరిధిలో 3.50 లక్షల సభ్యత్వాలు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెదేపా జిల్లా అధ్యక్షులు, గృహనిర్మాణ సంస్థ రాష్ట్ర ఛైర్మన్ బత్తుల తాతయ్య బాబు తెలిపారు. అనకాపల్లి జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 50 వేలకు తక్కువ కాకుండా సభ్యత్వాలు చేయాలన్నారు. ఈనెల 26 నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని వివరించారు. పార్టీలో పని చేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు, సహజ మరణం చెందితే దహన సంస్కరణలకు రూ.10 వేలు చెల్లిస్తారని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, అధికార ప్రతినిధి కడిమిశెట్టి నర్సింగరావు, ఉపాధ్యక్షులు బొడ్డేడ జోగినాయుడు, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి బొడ్డేడ మురళి పాల్గొన్నారు.

అనువైన భూములు కేటాయించండి

నక్కపల్లి, న్యూస్‌టుడే: మండలంలో పరిశ్రమల నిమిత్తం ఏపీఐఐసీ సేకరించిన భూములను సంయుక్త కలెక్టర్ జాహ్నవి బుధవారం పరిశీలించారు. ఆర్డీఓ రమణతో కలిసి అమలాపురం, వేంపాడు, రాజయ్యపేట తదితర గ్రామాల్లో పర్యటించారు. మూలపర్ర ప్రాంతంలో ఇళ్లు కోల్పోయిన వారితో మాట్లాడారు. పునరావాసానికి ఉద్దండపురం, పెదబోదిగల్లం ప్రాంతంలో గుర్తించిన భూములను పటం ద్వారా పరిశీలించారు. ఉప తహసీల్దారు అన్నాజీరావు, ఆర్.ఐ. కన్నబాబు, ఏపీఐఐసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పటం ద్వారా భూముల వివరాలు తెలుసుకుంటున్న జేసీ జాహ్నవి

లింకులు క్లిక్ చేసి.. 3.79 లక్షలు పోగొట్టుకుని!

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉద్యోగాల కోసం ఆన్‌లైన్‌లో వెదుకుతున్న గృహిణి సైబర్ మోసగాళ్లకు చిక్కి రూ. 3.79 లక్షలు పోగొట్టుకున్నారు. నర్సీపట్నం గ్రామీణ ఎస్సై రాజారావు కథనం ప్రకారం.. నీలంపేట గ్రామానికి చెందిన మాకిరెడ్డి కల్పన (30) షేర్‌ఛాట్ యాప్‌లో ఉద్యోగాల కోసం వెదుకుతున్నప్పుడు ఓ లింకు కనిపించడంతో దానిని ఓపెన్ చేశారు. ఆ మహిళను ఓ లింక్ ఆకట్టుకుంది. మహిళల అలంకరణ వస్తువుల వివరాలను తాము చెప్పిన విధంగా షేర్ చేస్తుంటే బోనస్ ఇస్తుంటామని నేరగాళ్లు నమ్మించారు. తొలుత రూ. 130 బోనస్‌తో మొదలు పెట్టి దఫదఫాలుగా కొంత నగదు వేసేవారు. వారి మాయమాటలు నమ్మి 21 దఫాలుగా వారు సూచించిన విధంగా రూ. 3.79 లక్షలు వాళ్లిచ్చిన బ్యాంకు ఖాతాకు బదిలీ చేశారు. బోనస్‌లు ఆగిపోవడంతో ఖాతా బ్లాక్ అయిందని నమ్మించారు. చివరికి మోసపోయానని గుర్తించి బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వివరించారు.


పేదింట గ్యాస్ పండగ

ధరల పెరుగుదలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు వంటింటి భారం అధికమవుతోంది. కుటుంబానికి ఆధారమైనవారు మృతి చెందడంతో ఎందరో నిరుపేద మహిళలు కుటుంబాలను పోషించుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. కూలీనాలితో బతుకులు నెట్టుకురావడానికి కొందరు అవస్థలు పడుతున్నారు. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం 'దీపావళి' నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల సరఫరాను అమలుచేసేందుకు రంగం సిద్ధం చేయడంతో ప్రతి ఇంటా ఆనందం వెల్లి విరుస్తోంది. తమ కుటుంబాల్లో వెలుగులు నింపే అసలైన దీపావళి ఇది అంటూ ఈ పథకాన్ని కొనియాడుతున్నారు.

ఒక్కొక్కరికి రూ.2,550 ఆదా



కలెక్టరేట్, నర్సీపట్నం, ఎలమంచిలి పట్టణం, న్యూస్‌టుడే



కూటమి సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజలు మన్ననలు అందుకుంటోంది. ఇప్పటికే ఎన్టీఆర్ భరోసా పథకంలో భాగంగా పింఛన్లు పెంచింది. ఒకటో తేదీ సెలవు వస్తే ముందురోజే ఠంచన్‌గా పింఛను అందిస్తోంది. అన్న క్యాంటీన్‌లు ప్రారంభించి నిరుపేదలకు పట్టెడు అన్నం అందిస్తోంది. సూపర్ సిక్స్ పథకంలో భాగంగా మహాశక్తికి ఏటా మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా అందించడానికి కసరత్తులు ప్రారంభించింది. దీపావళి నుంచి మహిళలకు ఉచితంగా ఏటా మూడు గ్యాస్ సిలెండర్లు అందిస్తామని చెప్పడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నెల బడ్జెట్‌లో గ్యాస్ భారం నుంచి ఉపశమనం పొందనున్నారు.

అనకాపల్లి జిల్లాలో 24 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 4,87,034 కనెక్షన్లు ఉన్నాయి. ఇవి కాకుండా ప్రభుత్వ హాస్టల్స్ 822, వాణిజ్యపరంగా 2045 ఉన్నాయి. 5,47,539 మంది కార్డుదారులు ఉన్నారు. రేషన్‌కార్డులు ప్రాతిపదికన జిల్లాలో 16,42,617 సిలెండర్లను ఏటా 5.47 లక్షల కుటుంబాలకు అందించనున్నారు. నర్సీపట్నం డివిజన్‌లో లబ్ధిదారులు లక్ష మంది వరకు ఉండొచ్చంటున్నారు. సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో హెచ్‌పీ, ఇండేన్, భారత్ కంపెనీల్లో 60 వేల కనెక్షన్లు ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం గ్యాస్ సిలెండర్ ధర రూ. 850 వరకు ఉంది. దూరం బట్టి ధర పెరుగుతుంది. భార్య, భర్త, ఇద్దరు పిల్లలు ఉన్న కుటుంబంలో రెండు నెలలకో సిలెండర్ చొప్పున ఏడాదికి ఆరు అవసరం అవుతాయి. ప్రభుత్వం మూడు సిలెండర్లు ఉచితంగా అందించడానికి ముందుకు రావడంతో సగానికి పైగా ఆర్థిక భారం తగ్గిపోతుంది. ఒక్కో ఇంటికి సగటున రూ. 2,550 వరకు ఆదాకానున్నది. వంటింటి బడ్జెట్ ఖర్చు తగ్గనుండడంతో గృహిణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఊరట లభిస్తుంది



ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. భర్త చనిపోవడంతో ఫించను సొమ్ముతోనే కుటుంబాన్ని నెట్టుకురావడం చాలా కష్టంగా ఉంది. ఆర్థిక భారంతో నెల గడవడం ఇబ్బందిగా మారింది. మూడు సిలెండర్లు ఉచితంగా ఇస్తే కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉంటుంది. వీటి సొమ్ము ఆదా అయి ఖర్చులు బాగా కలిసివస్తాయి. – కాళ్ల సత్యవతి, గునుపూడి

పథకంతో ఎంతో ప్రయోజనం



పింఛను సొమ్ముతోనే జీవిస్తున్న నాకు ఈ పథకంతో ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఇటీవల భర్త మృతి చెందాడు. ఏ ఆధారం లేక నానా అవస్థలు పడుతున్నాను. మొన్నటి వరకు మెప్మాలో పని చేసేదానిని. ఆ ఉద్యోగం సైతం ఇప్పుడు లేదు. గ్యాస్ సిలిండర్లకు సొమ్ము చెల్లించడం చాలా కష్టమవుతోంది. ఈ పరిస్థితిలో ప్రభుత్వం బండలను ఉచితంగానే ఇవ్వడానికి సిద్ధం కావడం ఎంతో ఆనందంగా ఉంది. – పెట్ల వరలక్ష్మి, నర్సీపట్నం

చాలీచాలని జీతంతోనే పోషణ



ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్నాను. భర్తకు ఇటీవల ఉద్యోగం పోయింది. మార్కెట్‌లో అన్ని ధరలు చుక్కలనంటుతున్నాయి. చాలీచాలని జీతంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువవుతున్నాయి. ఉచిత సిలిండర్లతో మిగిలే డబ్బులతో కుటుంబ అవసరాలు గట్టెక్కే అవకాశం ఉంటుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ముందుకెళ్లడం హర్షణీయం. – బైలపూడి శ్యామల, పెద బొడ్డేపల్లి

సామాన్యులకు ఆనందం

ఏటా మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తే రూ.వేలల్లో భారం తగ్గుతుంది. ఇప్పటికే నిత్యావసర ధరలు పెరిగిపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. దీపావళి నుంచి ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు ఇస్తామని ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రకటించడం ఆనందంగా ఉంది. – శ్రీదేవి, గృహిణి, అనకాపల్లి

జాతీయస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో అచ్యుతాపురానికి చెందిన చైతన్య, దక్షిత ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 19, 21 తేదీల్లో అనంతపురం జిల్లాలో ఈ పోటీలు జరిగాయి. వీరితో పాటు అచ్యుతాపురానికి చెందిన వాసు సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను పలువురు అభినందించారు.

ఖోఖో పోటీలకు సెజ్‌కాలనీ బాలిక



జాగృతినాయుడును అభనందిస్తున్న తెదేపా నేత

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు దిబ్బపాలెం సెజ్ కాలనీకి చెందిన బాలిక అడిగర్ల జాగృతినాయుడు ఎంపికయ్యారు. అచ్యుతాపురంలో 7వ తరగతి చదువుతున్న ఈ బాలిక ఈనెల 22న లంకెలపాలెం ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపింది. వచ్చే నెల 12, 13, 14 తేదీల్లో పులివెందుల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకానుంది.

కత్తిసాములో ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం

కశింకోట, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి కత్తిసాము పోటీలలో కశింకోట జడ్పీ పాఠశాల విద్యార్థి కోడూరు గుణశేఖర్ సత్తా చాటాడు. నంద్యాలలో ఈనెల 20, 21, 22 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో బాలుర అండర్-17 విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు పీఈటీ వేదుల ప్రభాకర్ తెలిపారు. ఇతనిని హెచ్‌ఎం ఆచంట రవి, ఉపాధ్యాయులు అభినందించారు.

జూడో పోటీలో రజతం

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి జూడో పోటీలో గబ్బాడ ఉన్నత పాఠశాల విద్యార్థి పెట్ల చంద్రమౌళి ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకం సాధించాడు. శ్రీకాళహస్తిలో మూడురోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ విద్యార్థిని బుధవారం పాఠశాలలో ఏర్పాటైన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సి.సత్యనారాయణ (కిట్టూ మాస్టారు), వ్యాయామ ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు అభినందించారు.



చంద్రమౌళిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, పీడీ నాగేశ్వరరావు

ఫుట్‌బాల్, సెపక్ తక్రా పోటీలకు..

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్, సెపక్ తక్రా పోటీలకు ఎస్.రాయవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీను తెలిపారు. ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ అండర్-14 బాలికల విభాగంలో టి.ఎన్.వి.దుర్గ, సీహెచ్.చరిశ్మా, ఎ.దీపిక, అండర్-14 బాలుర విభాగంలో కె.నందకిషోర్, సెపక్ తక్రా అండర్-14 బాలికల విభాగంలో టి.ఎన్.వి.దుర్గ, అండర్-17 బాలుర విభాగంలో కె.ఫణీంద్ర ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు ఎం.ఎస్.సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.



ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ

కోటవురట్లను కమ్మేసిన పొగమంచు



కోటవురట్లను బుధవారం పొగమంచు కమ్మేసింది. వేకువజాము మొదలు కొని ఉదయం 8 గంటల వరకు భారీగా మంచు కురిసింది. దీంతో వాహన చోదకులు లైట్లు వేసుకొని రాకపోకలు సాగించాల్సి వచ్చింది. నర్సీపట్నం-అడ్డురోడ్డు మార్గంలో మలుపుల దగ్గర రహదారి స్పష్టంగా కనిపించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. – కోటవురట్ల, న్యూస్‌టుడే

మత్స్యకారుల సమస్యలపై ఎస్పీ సమీక్ష


పోలీస్ అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: వాకపాడులో నావికా ప్రత్యామ్నాయ స్థావరానికి అప్పగించనున్న భూముల సర్వేను బంగారమ్మపాలెం మత్స్యకారులు అడ్డగించిన నేపథ్యంలో ఎన్ఏవోబీలో పరిధిలోని పోలీస్ అధికారులతో ఎస్పీ తుహిన్ సిన్హా బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బంగారమ్మపాలెం మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలను అధికారులకు సూచించారు. ఎస్బీ డీఎస్పీ అప్పారావు. పరవాడ, నర్సీపట్నం డీఎస్పీలు సత్యనారాయణ, జీఆర్ఆర్ మోహన్ పాల్గొన్నారు.

అత్యాచారయత్నం కేసులో మూడేళ్ల జైలు

విశాఖ లీగల్, రోలుగుంట, న్యూస్‌టుడే: మానసిక దివ్యాంగ బాలికపై అత్యాచార యత్నం కేసులో యువకుడికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.30వేల జరిమానా విధిస్తూ పోక్సో న్యాయస్థానం ప్రత్యేక న్యాయమూర్తి జి.ఆనందిని తీర్పునిచ్చారు. నిందితుడు చెల్లించే జరిమానాను బాధితురాలికి నష్టపరిహారంగా ఇవ్వాలని ఆదేశించారు. పోక్సో న్యాయస్థానం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం, జె.పి. అగ్రహారానికి చెందిన కాకరదాసు(25) వృత్తిరీత్యా మోటారు మెకానిక్. అదే ప్రాంతానికి చెందిన దంపతులకు మానసిక దివ్యాంగురాలైన కుమార్తె(16) ఉంది. 2014 జులై 7న కాకరదాసు బాలికను మభ్యపెట్టి తన ఇంటికి తీసుకెళ్లి అత్యాచారం చేయబోయాడు. ఈలోపు అతని కుటుంబ సభ్యులు రావడం చూసి బాలికను విడిచిపెట్టాడు. ఇంటికి వెళ్లిన బాలికకు కడుపు నొప్పి రావడంతో ఏడవడం ప్రారంభించింది. ఆమె అమ్మమ్మ ఆరా తీయగా జరిగిన విషయాన్ని సంజ్ఞలతో తెలిపింది. ఈ మేరకు బాధితురాలి కుటుంబ సభ్యులు రోలుగుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడ్ని పోక్సో న్యాయస్థానంలో హాజరుపరిచారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి పై శిక్ష విధించారు.

వరద బాధితులకు రూ. 2.50 లక్షల విరాళం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధికి రాంబిల్లి మండలం గురజాపాలెం స్టైరాక్స్ లైఫ్ సైన్స్ ప్రై లిమిటెడ్ కర్మాగారం రూ.2,50,000 విరాళం ప్రకటించింది. ఈ చెక్కును బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయకృష్ణన్‌కు కర్మాగారం డిప్యూటీ జనరల్ మేనేజర్ సీహెచ్.వి.రాంప్రసాద్ అందించారు. మరింత మంది వరద బాధితులకు సహాయం చేయడానికి ముందుకు రావాలన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ పి.ముకుందరావు, కర్మాగారం ప్రతినిధులు పాల్గొన్నారు.


కలెక్టర్ విజయకృష్ణన్‌కు చెక్కు అందజేస్తున్న రాంప్రసాద్

అర్ధరాత్రి వరకు కొనసాగిన తనిఖీలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: కశింకోట మండలం సుందయ్యపేటలోని మద్యం తయారీ డిస్టిలరీల్లో మంగళవారం అర్ధరాత్రి వరకు సీఐడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. విశాఖ, జీఎస్‌పీ డిస్టిలరీల్లో 2019 నుంచి 2014 వరకు తయారైన మద్యం వివరాల రికార్డులు, హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఉన్నతాధికారులకు పంపారు. మద్యం తయారీ, గోదాములకు వెళ్లిన సరకు, తయారుచేసిన బ్రాండ్ల వివరాలను సమగ్రంగా సేకరించి ఏమైనా అవకతవకలు జరిగాయా? అన్న దానిపై ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు తనిఖీలు చేపట్టిన సీఐడీ అధికారులు ఇక్కడి నుంచి విశాఖపట్నం తిరిగి వెళ్లిపోయారు.

ఇది ఆ దైవమే ఇచ్చిన తీర్పు

కూటమి ప్రభుత్వం

వైకాపా ప్రభుత్వ హయాంలో ఎన్ని విమర్శలు వచ్చినా శారదా పీఠానికి కారుచౌకగా కట్టబెట్టిన భూములు.. ఎట్టకేలకు మళ్లీ ప్రభుత్వం చేతికొచ్చాయి.

★ శారదాపీఠానికి భూకేటాయింపులు రద్దు
★ వైకాపా హయాంలో కారుచౌకగా కొట్టేసిన వైనం
★ వెనక్కి తీసుకున్న కూటమి పాలకులు

23-10-2024 భూముల కేటాయింపు రద్దు చేస్తూ కూటమి మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం.

ఈనాడు, విశాఖపట్నం

నాడు కేటాయించిన 15 ఎకరాలను వెనక్కి తీసుకునే అంశానికి బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. వైకాపా హయాంలో ‘రాజగురువు’ తరహా హోదా పొందిన శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అడిగిందే తడవుగా నాడు జగన్ ఈ భూములు కేటాయించారు. తొలుత వేద విద్యకు భూములు ఇవ్వాలని కోరి ఆ తర్వాత ఆదాయ అవసరాలకు కేటాయించాలని అప్పట్లో లేఖ రాయడం తీవ్ర చర్చనీయాంశమైంది. అడిగిందే తడవుగా ఆగమేఘాలపై దస్త్రాలు కదిలాయి. అయితే..కూటమి ప్రభుత్వం రాకతో కథ మారింది.

ఇక్కడే ఎందుకంటే...


శారదా పీఠానికి కేటాయించిన ఈ భూములు చాలా కీలకమైన ప్రాంతంలో ఉన్నాయి. ప్రసిద్ధ ఎర్రమట్టి దిబ్బలకు సమీపంలో ఉన్నాయి. అంతే కాదు..ఈ కొండపైనుంచి చూస్తే సాగర తీర అందాలు ఆకట్టుకుంటాయి. విశాఖ-భోగాపురం రహదారికి అతి సమీపంలో ఉన్నందున ఈ భూములను కేటాయించినట్లు సమాచారం.

2021లో అప్పటి సీఎం జగన్ విశాఖపట్నంలోని శారదాపీఠానికి వచ్చారు. ఆ సమయంలో భూకేటాయింపులకు సంబంధించిన అంశం సీఎం దృష్టికి తీసుకెళ్లారు.. భూమి కేటాయింపులపై అధికారులను పురమాయించాలని ఆదేశించారు. ఆ తర్వాత ఈ ప్రక్రియ ఊపందుకుంది. పీఠం అనుకున్నది జరిగింది.



వైకాపా ప్రభుత్వం 2022 ఆగస్టులో 343జీవోలోని బదలాయింపు ఉత్తర్వులను సవరించి ఉత్తరాధికారి పేరున భూములు కేటాయిస్తున్నట్లు కొత్తగా మరో జీవో ఇచ్చారు.

↑ కేటాయించిన భూమి ఇదే

అధికారులు ప్రతిపాదించిన ధరకన్నా.. భీమిలి అతి సమీపంలో కొత్తవలస వద్ద విలువైన 15 ఎకరాలు నాటి వైకాపా ప్రభుత్వం కేటాయించింది. ఇక్కడ ఎకరా రూ.25 కోట్లు పలుకుతుంది. అలాంటి చోట ఎకరా రూ.లక్షకే కట్టబెట్టారు. అధికారులు చెప్పిన ధరకన్నా అతి తక్కువకే ఇచ్చేశారు..



వీఎంఆర్‌డీఏ అత్యుత్సాహం » శారదా పీఠానికి గత ప్రభుత్వం పూర్తిగా దాసోహమైందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఎందుకంటే.. కొత్తవలసలో స్థలం కేటాయించడంతో పాటు వ్యూహాత్మక ఆలోచనతో ఉదారంగా రోడ్డు సదుపాయం కూడా కల్పించారు. భూ కేటాయింపు ఆలోచన ప్రాథమిక దశలో ఉండగానే రోడ్డు కోసం కూడా ప్రణాళిక చేశారు. కొత్తవలస కొండ మీద పీఠానికి స్థలం కేటాయించిన అనంతరం అభివృద్ధి లేదు. ఆయుష్మాన్ విశాఖ మహానగర అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)ను తెరమీదకి తెచ్చి ఘాట్ రోడ్డు నిర్మించారు. ఇందుకు సుమారు రూ.2 కోట్ల ప్రజాధనం ఖర్చు చేశారు. నేరుగా శారదా పీఠానికి రోడ్డు వేస్తే విమర్శలు వస్తాయని అదే కొండ మీద వీఎంఆర్‌డీఏకు 50 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అక్కడికి వెళ్లేందుకే ఈ రోడ్డంటూ వాయువేగంగా నిర్మించేశారు. కొండ కింద నుంచి పైకి 1.20 కిలోమీటర్ల ఘాట్ రోడ్డును 40 అడుగుల వెడల్పుతో పూర్తి చేశారు.

అంతర్ జిల్లాల హాకీ పోటీలకు జిల్లా బృందం ఎంపిక


పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ రత్నం తదితరులు

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఎస్.జి.ఎఫ్. ఆధ్వర్యంలో త్వరలో జరిగే అంతర్ జిల్లా అండర్-14 హాకీ పోటీలకు సంబంధించి జిల్లా జట్టు ఎంపిక బుధవారం నక్కపల్లి క్రీడా మైదానంలో జరిగింది. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం బాల, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. నక్కపల్లి బీఎస్ హాకీ క్లబ్ క్రీడాకారులను తయారు చేయడమే కాకుండా, ఆటల నిర్వహణలో సత్తా చాటుతోందని కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. అండర్-14 పోటీలు వచ్చేనెలలో నక్కపల్లిలోనే జరుగుతాయని ఎస్.జి.ఎఫ్. కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాల్లోని పలువురు హాజరయ్యారు. కార్యక్రమంలో ఉపసర్పంచి వీసం రాజు, క్లబ్ కార్యదర్శి కొల్నాటి తాతాజీ, పోలినాటి నానాజీ, అడ్డూరి శ్రీను, అడ్డూరి లోవరాజు, నడిగట్ల రమణ, కొప్పిశెట్టి వీరబాబు, కొల్నాటి నానాజీ, గాజుల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం నుంచి ఇద్దరు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి అండర్-14 హాకీ పోటీలకు ధర్మవరం-అగ్రహారం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నుంచి కె.నికిత, బి.నిహారిక ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయిని దీపిక బుధవారం తెలిపారు. విద్యార్థినులను ఇన్‌ఛార్జి ఎంఈఓ-2 సత్తిబాబు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు అభినందించారు.

లక్ష్య సాధనలో ప్రథమస్థానానికి కృషి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: మహిళలకు రుణాలు మంజూరు చేసి వారికి ఆర్థిక చేయూత అందించి లక్ష్య సాధనలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉండాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ ఉన్నతి తదితర పథకాలపై చర్చించారు. జిల్లాలో ఏర్పాటుచేసిన మహిళా మార్టుల్లో అనుకున్న స్థాయిలో అమ్మకాలు లేవని, వీటిని పెంచి లాభాలు సాధించేందుకు కృషి చేయాలని కోరారు. మహిళా సంఘాలతో నిర్వహించే సమావేశాల్లో గృహహింస, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, సైబర్ మోసాలపై అవగాహన పెంచాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, ఏపీడీ డైజీ పాల్గొన్నారు.

బాలుడిని కొట్టిన కుక్ తొలగింపు


వసతిగృహ వార్డెన్‌తో మాట్లాడుతున్న విద్యార్థి తండ్రి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులకు వండి భోజనాలు పెట్టాల్సిన కుక్ మద్యం మత్తులో విద్యార్థిని బెత్తంతో కొట్టాడు. ఉన్నతాధికారులు కుక్‌ను సస్పెండ్ చేశారు. బుచ్చెయ్యపేటకు చెందిన శనివాడ హేమంత్ ఆరోతరగతి చదువుతూ గాంధీనగరంలోని అనుసూచిత (డీఎన్‌టీ) బాలుర వసతి గృహంలో ఉంటున్నాడు. ఆదివారం రాత్రి భోజనం చేయడానికి పిల్లలు రావడంతో చారు ఆలస్యమైంది. ఈ సమయంలో విద్యార్థులు గొడవ చేస్తుండడంతో వసతి గృహంలో పనిచేస్తున్న కుక్ ఎం.కుమార్ ఇద్దరు విద్యార్థులను కర్రతో కొట్టాడు. హేమంత్‌ను ఎక్కువగా కొట్టడంతో వీపుపై తట్టుతేలింది. ఈ విద్యార్థి జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పాడు. దీంతో మంగళవారం విద్యార్థి మేనమామ వచ్చి సంఘటనపై ఆరా తీయగా కుక్ కుమార్ మద్యం మత్తులో విద్యార్థిని కొట్టినట్లు తేలింది. బుధవారం విద్యార్థి హేమంత్ తండ్రి పైడిబాబు వసతిగృహానికి రాగా జరిగిన విషయాన్ని వార్డెన్ నారాయణ వివరించారు. కుక్ క్షమాపణ చెప్పినా కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. చివరికి కుక్‌ను సస్పెండ్ చేస్తూ బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారిణి రాజేశ్వరి ఉత్తర్వులు జారీచేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని వార్డెన్ తెలిపారు.

మరదలిపై అత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలిలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని బుధవారం అరెస్ట్ చేశామని పరవాడ డీఎస్పీ కె.సత్యనారాయణ చెప్పారు. బుధవారం రాత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం రాత్రి బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందితుడు నేరాన్ని అంగీకరించాడన్నారు. పెద్దల సమక్షంలో అతని ఇంటి వద్దే నిందితుడిని అరెస్ట్ చేశామని వివరించారు. భార్య తన సహాయం కోసం ఆమె చెల్లెలిని ఇంటికి తోడు తెచ్చుకుందని, పనుల్లో సాయపడడానికి వచ్చిన భార్య చెల్లిపై నిందితుడు అత్యాచారం చేశాడన్నారు. మేలో ఒకసారి, సెప్టెంబరులో రెండు సార్లు ఇలా ఆమెపై అత్యాచారం చేశాడని బాధితురాలు వివరించిందన్నారు. ఇతనిపై పోక్సో చట్టంకింద కేసు నమోదు చేసి తాను దర్యాప్తు చేస్తున్నానన్నారు. సీఐ ధనుంజయరావు, ఎస్సై సావిత్రి పాల్గొన్నారు.

డీఈవో కార్యాలయం వద్ద ఆందోళన


ఆందోళన చేస్తున్న కార్మికులు


అనకాపల్లి, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజన, పాఠశాలలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు బుధవారం డీఈఓ కార్యాలయం ముందు ధర్నా చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి, పారిశుద్ధ్య కార్మికుల సంఘ జిల్లా అధ్యక్షురాలు శివలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులను అధిక సంఖ్యలో తొలగిస్తూ వారికి అనుకూలమైన వారిని నియమించుకుంటున్నారని ఆరోపించారు. 300 మంది పిల్లలకు ఒక కార్మికున్ని నియమించడం సరికాదన్నారు.

ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నంలో పదో తరగతి చదువుతున్న బాలిక (15) బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. నర్సీపట్నం సీఐ గోవిందరావు కథనం ప్రకారం.. శారదానగర్‌లోని బాంబే టైలర్ వీధిలో తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్న బాలిక పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఏడాదిగా మైగ్రేన్‌తో బాధపడుతోంది. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది. సాయంత్రం కుటుంబ సభ్యులొచ్చి చూసేసరికి ముందు గదికి లోపల గడియపెట్టి ఉంది. కిటికీలో నుంచి చూస్తే బాలిక ఉరికి వేలాడుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. నాతవరం మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ వివరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న లారీ

జగన్నాథగిరి కూడలిలో ఒకరి దుర్మరణం.. ఇద్దరికి గాయాలు



తుని గ్రామీణం, న్యూస్‌టుడే: లారీడ్రైవర్ నిద్రమత్తు ఓ నిండుప్రాణాన్ని బలితీసుకుంది. మరో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడ నుంచి విశాఖ వైపు కారులో **పైల వెంకటసత్య అప్పలస్వామినాయుడు** (60), మరో ముగ్గురు వ్యక్తులు వెళ్తూ మార్గమధ్యలోని తుని మండలం జగన్నాథగిరి కూడలి సమీపంలో బుధవారం తెల్లవారుజామున రోడ్డు పక్కన వాహనాన్ని ఆపారు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొనడంతో కారు ముందున్న అప్పలస్వామినాయుడు అక్కడికక్కడే మృతిచెందగా గోవిందరాజు, తారక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు దేవరాపల్లి మండలం కొంతెమెంట పంచాయతీలో పశుగణాంక అధికారిగా పనిచేస్తున్నారని ఎస్సై కృష్ణమాచారి తెలిపారు. ఈయన విశాఖపట్నానికి చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న జాతీయ రహదారుల అధీకృత సంస్థ అంబులెన్సు సిబ్బంది బాధితులను తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

లక్ష్మీదేవిపేట(అనకాపల్లి): గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) సంఘం జిల్లా అధ్యక్షులుగా కె.నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి.వి.వెంకటరత్నం, కార్యదర్శి వై.రామమ్మూర్తి ఆధ్వర్యంలో బుధవారం ఈ ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా కె.లోవరాజు, సహ అధ్యక్షులుగా చింత అప్పారావు, ఉపాధ్యక్షులుగా పి.దండు, వాకాడ గణేశ్, కోశాధికారిగా సీహెచ్.అప్పలరాజు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ట్రాక్టర్ ప్రమాదంలో మరొకరి మృతి

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని వెంకన్నపాలెం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తి మృతిచెందాడు. అనకాపల్లి నుంచి ప్రయాణికులతో వెంకన్నపాలెం వైపు వస్తున్న ఆటోను మంగళవారం రాత్రి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ దాడి రాము అక్కడికక్కడే మృతిచెందిన సంగతి తెలిసిందే. ఆటోలో ప్రయాణిస్తున్న చీడికాడ మండలం బి.సింగవరం గ్రామానికి చెందిన శరగడం పూర్ణచంద్రరావును (39) 108లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు సీఐ అప్పలరాజు బుధవారం తెలిపారు.

ఉద్యోగుల ఆటల పోటీలు 29 నుంచి

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి): జిల్లాస్థాయి సివిల్ సర్వీసెస్ పురుషులు, స్త్రీ ఉద్యోగులకు క్రీడా పోటీలు ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్నామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎల్.వి.రమణ పేర్కొన్నారు. ఎన్టీఆర్ క్రీడా మైదానం, చక్కెర కర్మాగారం ఆవరణ, చిన్న హైస్కూల్, రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం, డీసీఎంఎస్ గ్రౌండ్, జార్జ్‌క్లబ్‌ల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఎంపికైన వారు రాష్ట్రస్థాయి, అక్కడి నుంచి అఖిల భారత క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. గుర్తింపు ధ్రువపత్రాలతో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	137	130
డ్రెస్డ్	199	230
స్కిన్‌లెస్	226	240

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా : **దేవర**, రామచంద్ర: **మార్టిన్** ఉదయం, రెండోఆట, **రివైండ్** మేట్నీ. మొదటిఆట, శ్రీ సత్య: **మా నాన్న**, సత్యనారాయణ స్క్రీన్1: **విశ్వం**, స్క్రీన్2: **లవ్‌రెడ్డి**, వెంకటేశ్వర: **వీక్షణం**, పర్తిసాయి: **వేట్టయన్ ద హంటర్**, షిర్డిసాయి: **వేట్టయన్ ద హంటర్**

అచ్యుతాపురం: శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: **వేట్టయన్, విశ్వం** స్క్రీన్-2: **దేవర**

పరిహారం పంపిణీపై విచారణ చేయండి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పంట నష్టపరిహారం పంపిణీలో రేబాకలో అవకతవకలు జరిగాయని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు రైతులు కలెక్టర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. కొందరు కౌలురైతులుగా పంట నష్టం నమోదు చేయించుకున్నారన్నారు. 49 మంది రైతుల జాబితాలో 25 మందికి పైగా అక్రమార్కులు ఉన్నారన్నారు. వ్యవసాయంపై అవగాహన లేని వారు లబ్ధిదారుల జాబితాలో ఉన్నారన్నారు.



సమస్యలపై చర్చిస్తున్న అనకాపల్లి ఆర్డీఓ

బార్క్ సమస్యలపై ఆరా!

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: బాబా అణువిద్యుత్తు పరిశోధన కేంద్రం (బార్క్) ప్రాజెక్టు ప్రాంతంలో ఆర్డీఓ షేక్ అయిషా బుధవారం ఆమె పర్యటించారు. బార్క్ విస్తీర్ణం, కాలనీలు, రోడ్డు, నిర్వాసితులు, పెండింగ్ సమస్యలపై రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. మండల పరిధిలో సమస్యలు, పరిస్థితులపై అధికారులతో సమీక్షించారు. తహసీల్దార్ జనార్దన్, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్, ఆర్ఐ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన విభాగాల్లో పర్యవేక్షణ పడక

అనకాపల్లి/ పట్టణం, కశింకోట, న్యూస్‌టుడే

> అనకాపల్లిలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. కాలువలలో వ్యర్థాలు, పూడికలు అధికంగా ఉన్నాయి. పనులు సరిగా నిర్వహించడం లేదు. అలసత్వం వహిస్తే సహించం.
> – పి.సంపత్ కుమార్, జీవీఎంసీ కమిషనర్

అనకాపల్లిలో మంగళవారం పర్యటించిన కమిషనర్ ఇక్కడి పరిస్థితులపై ఆగ్రహం వ్యక్తం చేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్ల విభాగాల్లో పర్యవేక్షణ కొరవడడమే ప్రధాన కారణం. వీధిలైట్ల సమస్య ప్రజలను వేధిస్తోంది. లైట్ల మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాల్సి ఉండగా ఈ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. వీటి పర్యవేక్షణ బాధ్యతను జీవీఎంసీ ఏఈకి అప్పగించారు. ఇటీవల ఏఈని బదిలీ చేసినా ఇతని స్థానంలో కొత్త ఏఈని నియమించలేదు. సచివాలయానికి చెందిన ఇద్దరు సిబ్బందికి 80 నుంచి 84 వరకు వార్డుల వారీగా విభజన చేసి బాధ్యతలు అప్పగించారు. వీరికి పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పట్టణంలోని 7,195 ఎల్ఈడీ లైట్లు ఉండగా 500కి పైగా ఎల్ఈడీ లైట్లు మరమ్మతులకు గురయ్యాయి. వీటి మరమ్మతులు చేపట్టడంతో పాటు శివారు ప్రాంతాల్లో కొత్త విద్యుత్తు స్తంభాలు, వీధిలైట్లను ఏర్పాటుచేయాల్సి ఉంది. దీని కోసం ప్రతిపాదనలు తయారుచేయడం, నిధుల మంజూరు విషయాలపై సచివాయం సిబ్బందికి అవగాహన లేక అనకాపల్లిలో పలు ప్రాంతాలు అంధకారంగా మారాయి.



అనకాపల్లిలో ఇళ్ల ముందు చెత్త

» అనకాపల్లి నుంచి రాజుపాలెం వరకు జాతీయ రహదారిపై 719 లైట్లు ఉన్నాయి. వీటిలో 200 లైట్లు మరమ్మతులకు గురవడంతో ఇక్కడ రాత్రివేళలో అంధకారం అములుకుంటోంది. ఇటీవల 100 వరకు కొత్త లైట్లు ఏర్పాటుచేశారు. మరో 100 ఎల్ఈడీ లైట్ల ఏర్పాటులో జాప్యం నెలకొంది. జీవీఎంసీలో 14 మంది ఏఈలను బదిలీచేయగా నలుగురు మాత్రమే వచ్చినట్లు సమాచారం. వీరి కొరత కారణంగా సచివాలయం సిబ్బందిని తాత్కాలికంగా సర్దుబాటు చేస్తున్నారు.



తాగునీరు పట్టుకుంటున్న మహిళలు



అనకాపల్లి-చోడవరం రోడ్డులో అంధకారం

తాగునీటి విభాగంలో ..

తాగునీటి విభాగంలో ఏఈని బదిలీ చేసి ఈ బాధ్యతలను ఇద్దరు సచివాలయ సిబ్బందికి అప్పగించారు. పైప్‌లైన్ల మరమ్మతులు, మురుగు కాలువల నుంచి వెళ్తున్న పైప్‌లైన్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయడం, శివారు ప్రాంతాల్లో పైప్‌లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సచివాయ సిబ్బందికి అప్పగించారు. రెగ్యులర్ ఏఈ నియామకం చేపట్టక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

పరిశుభ్రతపై శ్రద్ధ ఏది?

పరిశుభ్రతను పర్యవేక్షించాల్సిన హెల్త్ ఆఫీసర్ పోస్టును భర్తీ చేయడం లేదు. అనకాపల్లి జోన్‌లోని ఐదు వార్డుల్లో నలుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే ఉన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ ఉన్నారు. పారిశుద్ధ్య పనులు చేయడానికి 235 మంది రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికులు అవసరం ఉండగా 99 మంది మాత్రమే పనిచేస్తున్నారు. కాంట్రాక్టు పద్ధతిలో 98 మంది పనిచేస్తున్నారు. ప్రజలకు సేవలు అందించే కీలక విభాగాల్లో అధికారుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

తల్లిదండ్రుల ఆశలను సాకారం చేయాలి

రాంబిల్లి, న్యూస్‌టుడే: లక్ష్యాలను చేరుకోవడం ద్వారా తల్లిదండ్రుల ఆశలను సాకారం చేయాలని ఎలమంచిలి సబ్‌కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ కోరారు. పంచదార్ల బీసీటీ గురుకుల ఉన్నత పాఠశాల, కస్తూర్బా విద్యాలయాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. వంటశాలలు, విద్యార్థుల వసతి గదులను పరిశీలించారు. రోజూ అందించే భోజనం గురించి తెలుసుకున్నారు. భోజనంలో రుచి, నాణ్యత ప్రమాణాలపై బాలికలను అడిగి తెలుసుకున్నారు. విద్యాబోధన, వసతులు, వైద్యసేవలపై ఆరా తీశారు. బాలికలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. తాజా కూరగాయాలు వంటలకు వినియోగించాలని చెప్పారు. పరిసరాలను జడ్జి పరిశీలించారు. విద్యాబోధన అందించే తీరుపై ప్రత్యేకాధికారిణి ప్రమీలతో చర్చించారు. విద్యార్థులు చదువులో రాణిస్తూ అనుకున్న లక్ష్యాలకు చేరుకోవాలని ఆమె కోరారు.



తరగతి గదులను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

పరిశ్రమ మూసివేతతో ఉపాధికి దూరం



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

ఎలమంచిలి, న్యూస్‌టుడే: అచ్యుతాపురం సెజ్‌లోని అభిజీత్ పరిశ్రమను తెరిపించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కోరారు. మంగళవారం ఆయన అమరావతిలో మంత్రిని కలిసి వినతి పత్రం అందించారు. పరిశ్రమను మూసేయడం వల్ల మూడువేల మంది కార్మికులు వీధిన పడ్డారన్నారు. వీరికి ఉపాధి కల్పించడానికి పరిశ్రమ తెరిపించాలన్నారు. వేల కుటుంబాలు ఉపాధి కోల్పోతున్నాయన్నారు. ముఖ్యమంత్రిని కలిసి ఈ విషయం వివరించానన్నారు. పరిశ్రమలు మూత పడకుండా చూడాలని ఆయన విన్నవించారు.

అ వీ ఇ వీ

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలిలో 33 కేవీ లైన్ పనుల కారణంగా పలు ప్రాంతాలకు గురువారం విద్యుత్తు సరఫరా ఉండదని ఏఈ రాజశేఖర్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ పట్టణంలోని ధర్మవరం, కాకివానివీధి, రామచంద్రమ్మ కాలనీ, కల్కి పెట్రోల్ బంక్, పెంజెరువు రోడ్డు, సోమలింగపాలెం ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: కూండ్రం, రొంగలివానిపాలెం, వేటజంగాలపాలెం, సంపతిపురం గ్రామాలకు శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎస్ రామకృష్ణ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరాకు ఆటంకం కలుగుతుందన్నారు.

పాల ఉత్పత్తుల విక్రయం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: తిమ్మరాజుపేట శిక్షణ కేంద్రంలో నాబార్డు, జనమిత్ర సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలు బుధవారం పన్నీరు తయారుచేసి విక్రయించారు. ఈ విక్రయాలను జనమిత్ర సీఈఓ కర్రి రమేష్‌బాబు, ఛైర్‌పర్సన్ కాంతమ్మ ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా నిలబడి స్వయం ఉపాధి మార్గాల్లో ప్రయాణం చేయాలని వారు సూచించారు.

బెల్లం మార్కెట్ బంద్

అనకాపల్లి, న్యూస్‌టుడే: గవరపాలేనికి చెందిన బెల్లం, ఎరువుల వ్యాపారి యల్లపు వెంకటరమణ (84) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఈయనకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. గవరపాలెంలోని సత్తమ్మతల్లి, మరిడిమాంబ ఆలయాలకు గౌరవ అధ్యక్షునిగా ఉన్నారు. శంకర్ థియేటర్ రహదారిలో షిర్డీ సాయి బాబా ఆలయం నిర్మించారు. ఇక్కడ గురువారం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఈయన మృతికి సంతాపంగా బుధవారం బెల్లం మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. శుక్రవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహిస్తారని బంధువులు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి - 80085 74722
ఎలమంచిలి - 80085 74726
పాయకరావుపేట - 80085 74749

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

?: అనకాపల్లి తాకాశివీధిలో మురుగుకాలువలో తాగునీటి పైప్‌లైన్లు వెళ్తున్నాయి. వీటిని సురక్షిత ప్రాంతానికి మార్చాలి. – నీరజ, అనకాపల్లి

✓: సమస్యను పరిశీలించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.
– హరీష్, ఏఈ, అనకాపల్లి

రీసర్వేలో ప్రతి సమస్యకు పరిష్కారం



వెదురుపర్తిలో అర్జీలు స్వీకరిస్తు న్న తహసీల్దారు

కశింకోట, ఎలమంచిలి గ్రామీణం, అచ్యుతాపురం, నక్కపల్లి, కోటవురట్ల, న్యూస్‌టుడే: భూముల రీసర్వేలో తప్పుల దొర్లిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దారు అడబాల శ్రీనివాసరావు తెలిపారు. కశింకోట మండలం వెదురుపర్తిలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 37 మంది రైతులు దరఖాస్తులు అందజేశారు. డీటీ భాస్కరరావు, మండల సర్వేయర్ రామారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు రమేష్ పాల్గొన్నారు. ఎలమంచిలి మండలం బయ్యవరంలో తహసీల్దార్ వరహాలుకు పలువురు రైతులు వినతులు అందజేశారు. తిమ్మరాజుపేటలో నిర్వహించిన రెవెన్యూగ్రామసభకు రీసర్వే వల్ల ఇబ్బందిపడిన రైతులు వరసకట్టారు. వైకాపా ప్రభుత్వం అస్తవ్యస్తంగా నిర్వహించిన సమగ్ర భూసర్వే వల్ల విస్తీర్ణాలు తగ్గిపోయాయని, పేర్లు తప్పులు ఉన్నాయని, పట్టాదారు పుస్తకాలు అందలేని అధికారులకు వివరించారు. రీసర్వే వల్ల తాము తీవ్రంగా నష్టపోయామని వాపోయారు. సమస్యలన్నీ నెలరోజుల్లో పరిష్కరిస్తామని దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని తహసీల్దార్ జనార్దన్ రైతులకు హామీ ఇచ్చారు. గ్రామపెద్దలు కర్రి ఆదిబాబు, శరగడం పైడిరాజు, జగ్గాఅప్పారావు, భీశెట్టి ఆదిబాబు, భీశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు. బుచ్చిరాజుపేటలో గ్రామసభలో 8 దరఖాస్తులు వచ్చినట్లు ఉపతహసీల్దారు అన్నాజీరావు తెలిపారు. పలువురు రైతులు తమ పేర్లు తప్పుగా నమోదైనట్లు వెల్లడించారు. ఆ మేరకు వీటిని పరిశీలించి పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. సర్పంచి కాళ్ల శ్రీనివాసరావు, ఆర్.ఐ. కన్నబాబు, వీఆర్వో దేముళ్లు తదితరులు పాల్గొన్నారు. అన్నవరంలో ఉన్న భూ సర్వే సమస్యలను పరిష్కారం చేస్తానని కోటవురట్ల తహసీల్దార్ తిరుమలబాబు అన్నారు.

ఘనంగా ప్రభాస్ జన్మదిన వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న అభిమానులు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: సినీ నటుడు ప్రభాస్ ప్రభాస్ పుట్టినరోజు వేడుకలు రామచంద్ర థియేటర్ వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మార్క్‌ఫెడ్ మాజీ ఛైర్మన్ డీవీవీ గోపాలరాజు హాజరయ్యారు. థియేటర్ సిబ్బందికి దుప్పట్లు, ఎన్టీఆర్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు అందించారు. పట్టణ అధ్యక్షులు జీవీఎల్ఎన్.రాజు, గౌరవాధ్యక్షులు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి కాండ్రేగులు జోగేంద్ర, కోశాధికారి కొణతాల అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ పర్యవేక్షకుడు ప్రసాద్‌కు పురస్కారం



ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఫ్యామిలీ ఫిజీషియన్ క్లస్టర్ పర్యవేక్షకుడు పీఎన్‌వీఎస్ ప్రసాద్ భారత్ శ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. నేషనల్ హ్యూమన్ వెల్ఫేర్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ అవార్డును అందించనుంది. వైద్య, ఆరోగ్య సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని, వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించినందుకు ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. వచ్చేనెల 10న దిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా కాన్ఫరెన్స్ హాలులో దీనిని అందుకోనున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు శక్తిప్రియ, వాసంతి, ఇతర వైద్య సిబ్బంది ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు

స్పందనకు వందనం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: బంగారమ్మపాలెంలో ఇళ్ల మధ్య వర్షపు నీరు నిలిచిపోకుండా డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వాకపాడు పంచాయతీ కార్యదర్శి జె.నరేష్ తెలిపారు. ఈ గ్రామంలోని దుస్థితిపై 'ఈనాడు'లో మంగళవారం ప్రచురితమైన 'బంగారమ్మపాలెంలో ఇళ్ల చుట్టూ నీరే' కథనంపై ఇన్‌ఛార్జి ఎంపీడీఓ సత్యనారాయణ ఆదేశాల మేరకు ఆయన బుధవారం ముంపు ప్రభావిత గృహాలను పరిశీలించారు. ఇక్కడ లోతట్టు ప్రాంతం కావడం, డ్రైనేజీ లేకపోవడంతో వర్షపునీరు ఇళ్ల మధ్య నిలిచిపోతున్నట్లు గుర్తించారు. పారిశుద్ధ్య కార్మికులతో నీరు తొలగించి, బ్లీచింగ్ చల్లించారు. డ్రైనేజీ నిర్మించాలంటూ గ్రామీణ నీటిసరఫరా అధికారులకు లేఖ రాసినట్లు తెలిపారు.

రోడ్ల పనులకు భూమిపూజ

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: తుమ్మపాలలో సీసీ రోడ్లు, కాలువ పనులకు సర్పంచి తట్టా పెంటయ్యనాయుడు బుధవారం భూమిపూజ చేశారు. మండల పరిషత్ నిధులు రూ. 20 లక్షలు కేటాయించారు. వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, ఎంపీటీసీ సభ్యుడు చదరం నాగేశ్వరరావు, న్యాయవాది పిల్లా హర శ్రీనివాసరావు, ఉప సర్పంచి చదరం చిన్న, పంచదార్ల కన్నారావు, పీలా విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

సేవలు ఆదర్శనీయం

అచ్యుతాపురం: నెహ్రూ యువజన సంఘం, జనమిత్ర సొసైటీ ద్వారా కర్రి సీతారామ్ అందించిన సేవలు ఆదర్శనీయమని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, తెదేపా బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి కర్రి ఆదిబాబు తెలిపారు. తిమ్మరాజుపేట జనమిత్ర సొసైటీ ఆవరణలో సీతారామ్ వర్ధంతి నిర్వహించారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి కన్యకాపరమేశ్వరి అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప దీక్షల ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. స్వామిని పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అయ్యప్పస్వాములు, భక్తులు, పేదలకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం పడి పూజ నిర్వహించారు. ఆలయ ప్రతినిధులు కటకం లక్ష్మణరావు, ఉప్పల శ్రీను, వీఎన్‌కే పేర్రాజు, కాశీపతి తదితరులు పాల్గొన్నారు.



అలంకరణలో అయ్యప్పస్వామి



నూకాంబిక అమ్మవారు

నూకాంబిక ఆలయ వార్షికోత్సవం

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని గవరపాలెం అరుంధతినగర్‌లోని నూకాంబిక ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. భారీగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ నిర్వాహకుడు పెట్ల నాగేశ్వరరావు భక్తులకు గాజులు, కుంకుమ పంపిణీ చేశారు.

అటూ ఇటూ తుప్పలు.. అంచుకెళితే ఇక్కట్లు



రోడ్డుకు ఇరువైపుల ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

కోటవురట్ల, న్యూస్‌టుడే

ప్రధాన రహదారులకు ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. నర్సీపట్నం-అడ్డరోడ్డు, లింగాపురం-తుని, జల్లూరు-కొడవటిపూడి వెళ్లే ప్రధాన మార్గం ఇరువైపుల పిచ్చి మొక్కలు ఏపుగా విపరీతంగా పెరిగిపోయాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు, రోడ్డు స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు పిచ్చి మొక్కలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

యాజమాన్య పద్ధతులతో పురుగుల నివారణ

నక్కపల్లి, న్యూస్‌టుడే: పంటలకు తెగుళ్లను వ్యాప్తి చేసే పురుగులను యాజమాన్య పద్ధతుల ద్వారా నివారించుకోవచ్చని శాస్త్రవేత్త బి.నాగేంద్రప్రసాద్ సూచించారు. మండలంలోని ఉద్దండపురంలో బుధవారం వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ గట్టు శుభ్రంగా ఉంచుకోవడం, పక్షి స్థావరాల ఏర్పాటు, వేప నూనె వినియోగం, పొలం గట్లపై బంతి మొక్కల పెంపకం ఇవన్నీ తెగుళ్లను నియంత్రిస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి పొడగట్ల రమణ, తుమ్మల వెంకటరమణ, తుమ్మల శ్యామ్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.


రాంబిల్లి: వరిలో తెగుళ్ల నివారణపై రైతులు దృష్టి పెట్టాలని జిల్లా వనరుల కేంద్రం ఏఓ పి.విజేత కోరారు. మామిడివాడలో రైతులకు ఆత్మ ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ నిర్వహించారు. ఏఓ సి.సుమంత, సర్పంచి మట్టా అప్పలనర్స, రైతులు పాల్గొన్నారు.



ఉద్దండపురం వద్ద తెగుళ్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలి

అనకాపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును కొనసాగించాలని వాకర్స్ క్లబ్ సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో బుధవారం పొట్టి శ్రీరాములు సమితి కన్వీనర్ పేరట్ల నరసింహమూర్తి ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శించారు. వాకర్స్ క్లబ్ నిర్వాహకులు డాక్టరు డీడీ నాయుడు, కాండ్రేగుల సత్యనారాయణ మాట్లాడుతూ 1985లో ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును ఖరారు చేస్తు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఇప్పుడు ఆయన పేరు తొలగించి వేరే పేరు పెట్టాలని తెలంగాణ ప్రభుత్వం చూడటం సరికాదన్నారు. కాండ్రేగుల రామలింగస్వామి, యల్లపు సత్యనారాయణ, కాండ్రేగుల జగ్గారావు పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సభ్యులు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నక్కపల్లి, న్యూస్‌టుడే: జాతీయ ఉపకార వేతన ప్రతిభా పరీక్షకు (ఎన్ఎంఎంఎస్) సిద్ధమవుతున్న చినదొడ్డిగల్లు విద్యార్థులకు పాఠశాలకు చెందిన రవీంద్రనాథ్ ఠాగూర్ ఆంగ్ల క్లబ్ వ్యవస్థాపకుడు యేడిద వెంకటరమణ బుధవారం స్టడీ మెటీరియల్ వితరణగా అందజేశారు. ప్రధానోపాధ్యాయిని బి.కవిత వీటిని పిల్లలకు అందించి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడిని అభినందించారు.

బురదనీరే గతి..

చేనేత కాలనీ వాసులకు తప్పని కష్టాలు

నక్కపల్లి, న్యూస్‌టుడే

నక్కపల్లి చేనేత కాలనీ వాసులు తరచూ కలుషిత నీటి సమస్య ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామానికి గొట్టివాడ పైలట్ ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా జరుగుతుంది. వారానికి మూడు రోజులు మాత్రమే సరఫరా జరుగుతుండగా, ఇందులోనూ కలుషిత నీరే అధికంగా వస్తోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని కాలనీకి వచ్చే పైపులైనుల్లో తరచూ బురద నీరు కలుస్తుండటం, పైపుల్లో లీకుల కారణంగా కలుషిత నీరు సరఫరా అవుతోంది.



నక్కపల్లిలో మురుగు నీటిలో పైపులు

✦ వర్షాలు అధికంగా కురిసినా ఇదే పరిస్థితి ఉంటుంది. రెండువారాల నుంచి కుళాయిల్లో నీరు ఎరుపు రంగులో వచ్చింది. తర్వాత రంగు తగ్గినా శుద్ధ నీరు మాత్రం సరఫరా కావడంలేదు. దీంతో చేసేదేమీ లేక కాలనీవాసులు ఈ నీటినే వాడుతున్నారు. ఆర్ఓ ప్లాంటు నీరు, బావినీరు తెచ్చుకోవాలంటే జాతీయ రహదారి దాటాల్సి ఉంటుంది. ప్రమాదాలు జరుగుతాయనే భయంతో అంతదూరం వెళ్లలేక కలుషిత నీటినే తాగేందుకు, వాడుకకు వినియోగిస్తున్నారు.



కుళాయిల నుంచి వస్తున్న బురదనీరు

బాధలు పట్టించుకున్నవారు లేరు



ఆదినుంచి మా కాలనీకి తాగునీటి ఇబ్బందులే. పైపులైన్ల లీకేజీతో నీరు రంగు మారుతోంది. తప్పనిసరై దీన్నే వాడుకుంటున్నాం. రెండు వారాలుగా నీరు బురద రంగులోనే వస్తోంది. అనారోగ్యం పాలైతే ఎవరిది బాధ్యత. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. – కె.మంగ, బి.సోమేశ్వరి

సమస్య పరిష్కరిస్తాం



ఇటీవల పైపులైను దెబ్బతింటే సరిచేశారు. మరెక్కడైనా పైపుల్లో లీకేజీ ఉందేమో పరిశీలిస్తాం. ఆ మేరకు సమస్య గుర్తించి తగు పరిష్కారం చూపుతాం. ఇదంతా తక్షణమే చేపడతాం.
– నాగభూషణం, ఏఈ

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల



కుళాయికి వస్త్రం కట్టి నీరు పట్టుకుంటున్న మహిళలు

వడకట్టినా.. వదలని రంగు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: మున్సిపాలిటీలో పలు చోట్ల తాగునీరు కలుషితం కావడం సాధారణమవుతోంది. రంగురాని బురద రంగుతో సరఫరా అవుతున్న ఈ జలం తాగి జనం రోగాలపాలవుతున్నారు. ఇక్కడ గత కొన్నేళ్లుగా కాలం చెల్లిన నీటి పథకాన్నే కొనసాగిస్తున్నారు. భూమి లోపల తుప్పుపట్టిన పైపులు పగిలి నీరు కలుషితం అవుతోంది. కొన్నిచోట్ల కాలువల్లో ఉన్న గొట్టాలతోనూ ఇదే సమస్య ఉత్పన్నమవుతోంది.

పాల సేకరణ ధర తగ్గింపుపై నిరసన

కె.కోటపాడు, న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ అవు పాల సేకరణ ధరలు తగ్గించినందుకు బుధవారం బత్తివాని పాలెం కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు నిరసన తెలిపారు. ధరలను పెంచి రైతులను ఆదుకోవాలని డెయిరీ సిబ్బందికి వినతిపత్రం అందచేశారు. జిల్లా కార్యదర్శి దాసరి వెంకన్న, సహాయ కార్యదర్శి నాయకులు, రొంగలి ముత్యాలనాయుడు, యర్రా దేముడు, నాయుడుబాబు, నాయుడు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలపై నిఘా

గొలుగొండ, న్యూస్‌టుడే: వంతెనలు, నీటి పథకాలు, సాగునీటి ఆనకట్టల వద్ద ఇసుక తవ్వకాలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. వీఆర్‌ఓల పర్యవేక్షణలో వంతులు వారీగా కాపలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. రాత్రిపూట తవ్వకాలకు వెళ్లేవారిపై నిఘా ఉంచుతున్నట్లు వెల్లడించారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకృష్ణ ఆడి: విశ్వం, కళ్ళ కంపెనీ 1995, లవ్ రెడ్డి, వీక్షణం, ఆడి2: వెట్టయన్, ఇద్దరు, ఆడి3: దేవర, ఆడి4: రోబోట్, రివైండ్, జనక.. అయితే గనక. రాజు: వెట్టయన్, విశ్వం, బంగార్రాజు: దేవర చోడవరం: శ్రీసాయిలక్ష్మి: వెట్టయన్ సాయిలక్ష్మి: విశ్వం, పూర్ణా: దేవర

పారిశుద్ధ్య కార్మికులను పెంచాలి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నంలో పెరుగుతున్న జనాభా అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని మున్సిపల్ కార్మికులు, ఒప్పంద కార్మికుల సంఘం (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి ఏసుదాసు కోరారు. ఈ మేరకు బుధవారం కమిషనర్ జంపా సురేంద్రకు విజ్ఞప్తి చేశారు. పారిశుద్ధ్య కార్మికులందరికీ పండగ బోనస్ కింద వెయ్యి రూపాయలు చొప్పున ఇవ్వాలని, ఒప్పంద కార్మికులను శాశ్వత కార్మికులుగా గుర్తించాలని, బకాయి పడిన సబ్బులు, నూనె, యాప్రాన్లు, వర్షపుకోట్లు సరఫరా చేయాలని కోరారు. సిబ్బంది కొరత కారణంగా ఉన్నవారిపై పనిభారం పెరుగుతోందని వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలన్నీ ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నాయకులు వేమగిరి రాజు, ఎ.అప్పారావు పాల్గొన్నారు.



అర్ధలో అసంపూర్తిగా..

బిల్లులు రాక.. భవనాలు అప్పగించక..

రోలుగుంట, న్యూస్‌టుడే

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సేవలందించే అంగన్‌వాడీ కేంద్రాలపై రాజకీయం రాజ్యమేలుతోంది. ఈ కారణంగా అభంశుభం తెలియని చిన్నారులు అవస్థలు పడుతున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన భవనాలకు తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా పాలకులు బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడి నిర్మాణాలు అక్కడే నిలిచిపోయాయి. గత్యంతరం లేక అద్దె కొంపల్లో నెట్టుకొస్తున్నారు.

★ ఐసీడీఎస్ రావికమతం ప్రాజెక్టు పరిధిలోని చోడవరం, రోలుగుంట, బుచ్చెయ్యపేట, రావికమతం మండలాలకు సంబంధించి 294 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో కేవలం 115 కేంద్రాలకే సొంతభవనాలున్నాయి. 179 కేంద్రాలకు భవనాలులేవు. ఇందులో 75 చోట్ల గ్రామాల్లోని సామాజికభవనాల్లో, పాఠశాల భవనాల్లో కొనసాగుతున్నాయి. సొంతభవనాలు కూడా చాలావరకు శిథిలావస్థలో ఉన్నాయి. ఒక్క రావికమతం పరిధిలోనే గుమ్మళ్లపాడు, దొండపూడి, గర్నికం, గొంప, చినపాచిల, కొమిర, తోటకూరపాలెం, కొత్తకోట-2, దొండపూడి తదితర సుమారు 20కి పైగా భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. రోలుగుంట మండలానికి సంబంధించి బుచ్చెంపేట శివారు గుర్రంపేట, అర్ల, గుండుబాడ శివారు బలిజపాలెం, వడ్డిప తదితర చోట్ల తెదేపా ప్రభుత్వ హయాంలో భవనాల నిర్మాణం ప్రారంభించినా వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత బిల్లులను మంజూరు చేయలేదు. ఈ కారణంగా ఎక్కడికక్కడే నిర్మాణాలు నిలిచిపోవడంతో పరాయిపంచల్లో ఉద్ద ప్రతిపాదిక కన నెట్టుకొస్తున్నారు.

గ్రామాల్లోని పాలకులు, నాయకులు వీటిపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

పూర్తికాని అంగన్‌వాడీ భవనాలు



బలిజిపాలెం పాఠశాల భవనంలోనే కేంద్రం

రూ.22 లక్షలతో ప్రతిపాదనలు

రోలుగుంట మండలం అర్ల, గుండుబాడ, వడ్డిప, గుర్రంపేట తదితర గ్రామాల్లో అసంపూర్తి భవనాలకు సుమారు రూ. 22 లక్షలు కావాల్సిన నిధులు అవసరమని ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. అర్ల భవనానికి సంబంధించి స్థానిక టీడీపీ సొంత నిధులతో తలుపులు, కిటికీలు వేయిస్తే ఆ భవననిర్మాణ గుత్తేదారు తనకు బిల్లు రాలేదనే కారణంగా వాటిని తీయించేసి ఆ భవనాన్ని ఆయన స్వాధీనంలోనే ఉంచుకున్నారు.

– రమ్య, సూపర్‌వైజరు, రావికమతం ఐసీడీఎస్

అడుగడుగునా గండమే!

తుని-నర్సీపట్నం రహదారి తరచూ రక్తసిక్తం అవుతోంది. అడుగుకో గుంత కారణంగా ఈ రోడ్డుపై ప్రయాణమంటేనే భయపడాల్సి వస్తోంది. కోటనందూరు నుంచి నాతవరం మండలం శృంగవరం మధ్య 14 కిలోమీటర్ల ఉత్తంత ప్రమాదకరంగా మారింది. గత ప్రభుత్వం కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ రోడ్డు గోతులమయంగా తయారైంది. నెల రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో దారుణంగా మారింది. అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లోని నర్సీపట్నం, తుని ప్రధాన పట్టణాలను కలిపే రోడ్డు కావడంతో రోజంతా వందలాది వాహనాలు వెళ్తూ వస్తుంటాయి. భారీ వాహనాలు గుంతలో పడి మరమ్మతులకు గురవుతున్నాయి. ఇక ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు ఎక్కడ ఎలాంటి గుంతలు ఉన్నాయో తెలియక పడిపోతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ దిగి రోజూ వాహనాలు అదుపుతప్పి ప్రతిరోజు కనీసం ఇద్దరు ద్విచక్రవాహనదారులు పడిపోతున్నారని, పలువురు రక్తమోడుతూ ఆసుపత్రులకు పరుగు తీస్తున్నారని గన్నవరం గ్రామస్థులు చెబుతున్నారు. సత్వరమే అయ్యన్న ఈ రోడ్డుపై దృష్టి సారించాలని కోరుతున్నారు. – నాతవరం, న్యూస్‌టుడే



శరభవరం వద్ద రోడ్డు దుస్థితి



గన్నవరం వద్ద అదుపు తప్పుతున్న వాహనాలు



కాకరాపల్లి వద్ద..


అంతులేని విజ్ఞానం.. అప్రమత్తత అవసరం

‘ఈనాడు’ ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: అంతులేని విజ్ఞాన సముపార్జనకు అంతర్జాలాన్ని మించిది లేదని విద్యార్థులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ‘ఈనాడు’ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు జరిగాయి. ‘ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం’ అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. ఇంటర్నెట్ వినియోగంలో హద్దుమీరినా.. అప్రమత్తంగా లేకున్నా తీవ్ర ఇబ్బందుల పాలవాల్సి వస్తుందని వీరు తమ రచనల్లో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు లింగమూర్తి, పి.ఆదినారాయణ, లక్ష్మణరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలుగా నిలిచిన తానారి మహేష్, వంతల రిబిక, సందేరి స్వర్ణలతకు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు గణేశ్వరరావు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఇన్‌ఛార్జి హెచ్‌ఎం గణేశ్వరరావు



వ్యాస రచన పోటీలో విద్యార్థులు

సర్కారు బడుల ప్రహరీలకు మోక్షం

చీడికాడ, దేవరాపల్లి, న్యూస్‌టుడే: మాడుగుల నియోజకవర్గంలో ఇకపై సర్కారు బడులకు ప్రహరీల సమస్య తీరనుంది. ప్రహరీలు లేని పాఠశాలలకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి ప్రకటించారు. నియోజకవర్గంలోని చీడికాడ, మాడుగుల, దేవరాపల్లి, కె.కోటపాడు నాలుగు మండలాల్లోని 62 పాఠశాలలకు రూ. 940.78 లక్షలు మంజూరు చేశారు. ఎన్నోఏళ్ల తర్వాత పాఠశాలల ప్రహరీల నిర్మాణానికి యాజమాన్యం, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ప్రహరీలేని వింటిపాలెం ప్రాథమిక పాఠశాల

మండలాల వారీగా మంజూరైన నిధులు

- ★ చీడికాడ మండలంలోని 11 పాఠశాలలకు ప్రహరీల నిర్మాణానికి రూ.149.95 లక్షలు
- ★ మాడుగుల మండలంలోని 11 పాఠశాలకు రూ. 140.07 లక్షలు.
- ★ దేవరాపల్లి మండలంలోని 18 పాఠశాల్లోని ప్రహరీలకు రూ. 276.67 లక్షలు.
- ★ కె.కోటపాడు మండలంలోని 22 పాఠశాలలకు రూ. 374.10 లక్షలు.

విద్యాభివృద్ధికి కృషి



నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పాఠశాలల్లో సమస్యలు గుర్తించాను. ప్రభుత్వ పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాను. అదనపు భవనాలు మంజూరు చేస్తాను. నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తాను. తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్లు పాఠశాలల అభివద్ధిపై దృష్టి సారించాలి.

– బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్యే, మాడుగుల

తీరని తాగునీటి ఇక్కట్లు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: అప్పన్న దొరపాలెం గ్రామంలో తాగునీటి ఎద్దడి గురించి ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని సర్పంచి రమణ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీ రుత్తల లక్ష్మి ఎంపీపీ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అధికారులు తమవద్దనున్న సమాచారాన్ని సమావేశంలో ప్రజా ప్రతినిధులకు చదివి వినిపించారు. నాడు-నేడు నిధులతో పాఠశాలల అభివృద్ధి చేశామని అధికారులు చెబుతున్నా, విద్యార్థులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని రాచపల్లి ఎంపీటీసీ సభ్యుడు యర్రాపాత్రుడు పేర్కొన్నారు. పాఠశాల కమిటీ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని, పాపయ్యపాలెం ప్రభుత్వ పాఠశాలలో వార్డు సభ్యుడిని కమిటీ ఛైర్మన్‌గా ఎలా నియమించారని ఎంఈఓ మూర్తిని ప్రశ్నించారు. కొత్తపాలెం నిర్వాసిత కాలనీలో లబ్ధిదారులపై పయనీర్ పరిశ్రమ యాజమాన్యం దాడులకు దిగి నిర్వాసితులు నిర్మించుకున్న ఇళ్లు కూలదోయడంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బూరుగుపాలెం ఎంపీటీసీ రుత్తల యర్రాపాత్రుడు సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సమావేశంలో తీర్మానం చేసి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీఓ సీతామహాలక్ష్మి, ఉప తహసీల్దారు సోమశేఖర్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎంఈఓను ప్రశ్నిస్తున్న యర్రాపాత్రుడు

అ.వీ.ఇ.వీ

భాజపా సభ్యత్వ నమోదు

చీడికాడ: మండలంలోని వీరభద్రపేటలో భాజపా ప్రచార కమిటీ ఛైర్మన్ శివాజీరాజు ఆధ్వర్యంలో బుధవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. సభ్యత్వం పొందిన వారికి ఆయుష్మాన్ భవ కార్డులను అందజేశారు.

వెంటాడుతున్న విద్యుత్తు కష్టాలు

చోడవరం: నర్సయ్యపేట గ్రామాన్ని విద్యుత్తు కష్టాలు వెంటాడుతున్నాయి. సచివాలయం సమీపంలోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపాల కారణంగా రెండు నెలలుగా విద్యుత్తు సరఫరా సక్రమంగా జరగడం లేదని సహకార సంఘం మాజీ డైరెక్టర్ గుమ్మిడి శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.

విద్యార్థుల పరిశ్రమ సందర్శన

మాకవరపాలెం: పరిశ్రమల సందర్శనలో భాగంగా తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులను బుధవారం మండలంలోని పేపరు విస్తరాకుల పరిశ్రమకు తీసుకెళ్లారు. యంత్రాలు ఎలా పనిచేస్తాయి, ముడిసరకు ఎక్కడ నుంచి వస్తుందనే విషయాలను పరిశ్రమ యజమాని సన్యాసినాయుడు వివరించారు. ప్రధానోపాధ్యాయుడు కోసూరు రాము, ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామికి వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పారాయణం, యాగశాల అర్చనలు, హోమాలు చేపట్టారు. గుడి ప్రాంగణమంతా వేదమంత్రాలతో మారుమోగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ తాటికొండ బ్రహ్మలింగస్వామి, ప్రధాన అర్చకులు శరత్ కుమార్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

డీ పట్టాలు ఎందుకు రద్దు చేశారు?



కవగుంటలో అధికారులను ప్రశ్నిస్తున్న రైతులు

రావికమతం, న్యూస్‌టుడే: దశాబ్దాలుగా తమ సాగులో ఉండే బంజరు భూముల డి-పట్టాలను జగనన్న రీ సర్వేలో రద్దుచేసి, గిరిజనేతరుల పేరిట రికార్డుల్లో ఎందుకు నమోదు చేశారో చెప్పాలని కవగుంటలో రైతులు రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. గ్రామంలో బుధవారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. కలెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినా ఇంతవరకు రైతుల పేరిట పట్టాలు ఎందుకు పునరుద్ధరించలేదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు నిలదీశారు. రీ సర్వేలో జరిగిన తప్పులను సరి చేయాలని కోరుతూ పలువురు అర్జీలు అందజేశారు.

చీడికాడ, మాకవరపాలెం, న్యూస్‌టుడే: రీ-సర్వేపై రైతుల నుంచి స్వీకరించిన సమస్యలను సకాలంలో పరిష్కరిస్తామని చీడికాడ తహసీల్దార్ ప్రసాదరావు అన్నారు. అప్పలరాజుపురంలో బుధవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భూ సమస్యలపై గ్రామసభలో అర్జీలను అందజేశారు. మాకవరపాలెం సభలో పలువురు రైతులు అధికారులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఆన్‌లైన్‌లో తమ భూముల వివరాలు కనిపించక పోవడంతో బ్యాంకు అధికారులు రుణాలు ఇవ్వడం లేదని పెదపల్లి రమణ ఆవేదన వ్యక్తం చేశారు. భూ విస్తీర్ణం నమోదులో తప్పిదాలను సరిచేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రుత్తల నారాయణమూర్తి పేర్కొన్నారు.

నాతవరం, గొలుగొండ: రీసర్వే చేసిన 32 రెవెన్యూ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు నాతవరం తహసీల్దారు వేణుగోపాల్ తెలిపారు. తప్పులు లేకుండా కొత్త పాసుపుస్తకాలు రైతులకు అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. రీ సర్వే వల్ల తలెత్తిన అన్ని భూ సమస్యలు గ్రామసభల దృష్టికి తీసుకు రావాలని గొలుగొండ తహసీల్దార్ శ్రీనివాసరావు కోరారు. చీడిగుమ్మలలో రైతుల నుంచి ఆయన వినతులు తీసుకున్నారు.

కె.కోటపాడు, న్యూస్‌టుడే: కె.జె.పురంలో రీసర్వే, భూసమస్యల పరిష్కార గ్రామసభ బుధవారం తహసీల్దారు భాగ్యవతి ఆధ్వర్యంలో జరిగింది. 86 మంది రైతులు వివిధ సమస్యలపై వినతులు అందించారు.

సుడిదోమ వ్యాప్తిపై అప్రమత్తం

మాడుగుల గ్రామీణం, కె.కోటపాడు, న్యూస్‌టుడే: వరి పైరును ఆశించే సుడిదోమ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారి వాసుదేవరావు అన్నారు. మాడుగుల, కె.జె.పురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సుడిదోమ నివారణకు ప్రాథమిక దశలో ఎసిఫేట్‌ను, ఎక్కువగా ఉంటే పైమెట్రోజైన్, డైనెటో ఫ్యూరాన్ పిచికారీ చేయాలని సూచించారు. మాడుగుల, కె.జె.పురం సర్పంచులు యడ్ల కళావతి, జామి రమణబాబు, ఎంపీటీసీ సభ్యులు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. కె.కోటపాడు వ్యవసాయాధికారి సోమశేఖర్ దాలివలస, కింతాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సర్పంచులు భూమిరెడ్డి దేముళ్లు, బండారు ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: కె.పి.అగ్రహారం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించారు. వరిలో సుడిదోమ, ఆకుముడత, పాచితెగులు వ్యాపించినట్లు గుర్తించారు. మండల వ్యవసాయాధికారి భాస్కరరావు, సర్పంచి గోపిశెట్టి శ్రీనువాసరావు, ఎంపీటీసీ సభ్యుడు దేవర అప్పారావు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు వినతి

చోడవరం: చోడవరం నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు జీవనోపాధి కల్పించాలని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కార్పొరేషన్ ఛైర్మన్ మంతెన రామరాజును కోరినట్లు జనసేన చోడవరం నియోజకవర్గ సమన్వయకర్త రాజు తెలిపారు. మంగళగిరిలో బుధవారం ఆయనను కలిసి ఇక్కడి పరిస్థితులను వివరించామన్నారు.

25 వరకు ఆధార్ శిబిరాలు

మాడుగుల గ్రామీణం: సచివాలయాల్లో ఏర్పాటుచేసిన ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అప్పారావు కోరారు. తాటిపర్తిలో ఆధార్ శిబిరాన్ని పరిశీలించారు. ఈనెల 25 వరకు శిబిరాలు జరుగుతాయన్నారు.

బకాయిలతో విద్యార్థులపై ఆర్థిక భారం

మాకవరపాలెం, న్యూస్‌టుడే: విద్యాకానుక, విద్యాదీవెన, ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే చెల్లించి ఆదుకోవాలంటూ భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) నాయకులు కోరారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మాకవరపాలెంలో బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వంపై నమ్మకంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఉప తహసీల్దారు సోమశేఖర్‌కి వినతిపత్రం అందించారు.



మాకవరపాలెంలో విద్యార్థుల ర్యాలీ

వసతిగృహాల్లో న్యాయమూర్తి తనిఖీలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: స్థానిక సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పి.షియాజ్‌ఖాన్ బుధవారం రాత్రి పట్టణంలోని వసతిగృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక పీనారిపాలెంలో ఛారిటబుల్ ట్రస్టు నిర్వహిస్తున్న వసతి గృహాన్ని తనిఖీ చేసినప్పుడు ఒక బాలిక చేతులకు గజ్జి ఉండడాన్ని చూసిన న్యాయవాది ఆ పాపను ప్రశ్నించగా.. తనతోపాటు చదువుతున్న వారికి ఈ చర్మ వ్యాధి ఉన్నట్లు తెలిపింది. దీంతో వెంటనే ఆయన ఆ పాఠశాలను తనిఖీ చేశారు. బీసీ బాలుర కళాశాల వసతిగృహాన్ని పరిశీలిస్తున్న సమయంలో ఎస్ఎఫ్ఐ నాయకుడు గీతాకృష్ణ కలిసి నర్సీపట్నంలో బాలికలు చాలామంది ఆకతాయిల వేధింపులకు గురవుతున్నట్లు న్యాయవాదికి ఫిర్యాదు చేశారు. బడి బస్సులు విద్యార్థులకు అందుబాటులో ఉండటం లేదని తెలిపారు.



కళాశాల బాలుర వసతిగృహాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి షియాజ్‌ఖాన్

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743
చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74737

చోడవరం, న్యూస్‌టుడే



?: యడ్లవీధి దరి అంబేడ్కర్ కాలనీలో కల్వర్టుకు రంధ్రం పడింది. రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

– వరప్రసాద్, చోడవరం

✓: ఉపాధి హామీ నిధులతో కల్వర్టులను అభివృద్ధి చేయనున్నాం.

– నారాయణరావు, పంచాయతీ కార్యదర్శి

గొలుగొండ, న్యూస్‌టుడే



?: ఎర్రవరం రాజులబాబు గుడి దరి కల్వర్టుపై గొయ్యి ఆందోళన కలిగిస్తోంది. ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది.

– కె.అప్పలనాయుడు, చీడిగుమ్మల

✓: వాహన చోదకుల ఫిర్యాదు మేరకు అక్కడ గొయ్యిని గుర్తించాం. గోతిని పూడ్చించి ప్రమాదం జరగకుండా చర్యలు చేపడతాం. – ప్రసాదరావు, జేఈ, ర.భ.శాఖ

కె.కోటపాడు, న్యూస్‌టుడే

?: బత్తివానిపాలెం కల్లాలకు వెళ్లే మట్టి రోడ్డు అధ్వానంగా ఉంది. సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయాలి.

– అప్పారావు, బత్తివానిపాలెం

✓: సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం.

– సుమతి, ఏఈ, కె.కోటపాడు

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోండి

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథం, మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్షల గుర్తింపు, అవగాహన సదస్సు జరిగింది. డాక్టర్ తేజస్విని మాట్లాడుతూ స్వాస్థ్యభారత్‌లో భాగంగా క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని కళాశాలలో ప్రారంభించామని, పరిసర ప్రాంత మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 40మంది మహిళలు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. క్యాన్సర్ నిర్మూలనపై వైద్యులు, అధ్యాపకులు గోడప్రతులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చరిత, మాధురి, మధువర్షిణి పాల్గొన్నారు.



క్యాన్సర్ నిర్మూలనపై పోస్టరును ఆవిష్కరిస్తున్న వైద్యులు, మహిళా అధ్యాపకులు

కంటి వైద్య శిబిరానికి స్పందన

మాకవరపాలెం, న్యూస్‌టుడే: అంధత్వ నివారణ సంస్థ, విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో బుధవారం మాకవరపాలెంలో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 135 మందికి వివిధ రకాల కంటి పరీక్షలు నిర్వహించగా 80 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు శివమనోహర్‌నాయుడు తెలిపారు.

పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్ ప్లస్-1 - దేవర
ప్లస్-2 - విశ్వం

మర్యాదపూర్వక కలయిక

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండల తహసీల్దారుగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బి.చిన్నికృష్ణను బుధవారం మండల తెదేపా నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. అనకాపల్లి పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షుడు పీవీజీవీఎస్ రాజు, మండల తెదేపా కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ గండి దేముడు తదితరులు తహసీల్దారుకు పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. మండలంలో అపరిష్కృత సమస్యలు చాలా ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు.

బ్రాహ్మణుల నియామకంపై హర్షం

పెందుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దేవాలయాల పాలక వర్గాల్లో బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరిని సభ్యులుగా అవకాశం కల్పించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించడంపై ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వడ్డాది ఉదయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బ్రాహ్మణులకు ప్రభుత్వం పెద్దపీట వేయడం శుభ సూచకమన్నారు. సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM

పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

– న్యూస్‌టుడే, పెందుర్తి

సమస్య: జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ ఏ-జోన్‌లోని 15బి/1/3, సి-2 జోన్‌లోని 18బి/1 స్తంభాలకు ఉన్న వీధి దీపాలు గత కొన్నాళ్లుగా వెలగడం లేదు. రాత్రివేళ చీకట్లో స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.
– పి.వి.శర్మ, ఏ-జోన్, ఎ.అమ్మతల్లి సీ-2 జోన్

సమాధానం: మీ ప్రాంతాల్లో వెలగని వీధి దీపాలకు త్వరలోనే మరమ్మతు చేయించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – శివరామ్ ప్రసాద్, ఏఈ, 97వ వార్డు

వృత్తి శిక్షణ.. భవిష్యత్తుకు రక్షణ

పాఠశాల స్థాయి నుంచి కొనసాగుతున్న ఇంటర్న్‌షిప్

వేపగుంట, న్యూస్‌టుడే: పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు స్వశక్తిపై నిలబడేలా జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వ బడుల్లో సరికొత్త చదువులను నేర్పిస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు వృత్తి విద్యను నేర్పిస్తే భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడే అవకాశం ఉంది. 2017లో తెదేపా ప్రభుత్వ హయాంలో దీన్ని ప్రవేశపెట్టినప్పటికీ గత వైకాపా ప్రభుత్వం దీనిపై పెద్దగా దృష్టి సారించకపోవడంతో తూతూమంత్రంగానే పాఠశాలల్లో వృత్తి విద్య కోర్సులు కొనసాగించారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ కల్పించాలని ప్రణాళికలు రచించింది. ఇంటర్న్‌షిప్ పేరుతో పలు కంపెనీలు సంబంధించిన కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు.



విద్యార్థుల శిక్షణను పరిశీలిస్తున్న సమన్వయకర్త కాలేషావలి

ఏదో ఒక అంశంలో నైపుణ్యం పొందాలనే..

2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం ప్రయోగాత్మకంగా రాష్ట్ర వ్యాప్తంగా 50 పాఠశాలల్లో ఈ శిక్షణను ప్రారంభించింది. ప్రతీ విద్యార్థి ఏదో ఒక అంశంలో నైపుణ్యం పొంది ఉండాలన్న సంకల్పంతో అడుగులు ముందుకు వేస్తుంది. దీనిలో భాగంగా పాఠశాలలో వృత్తి విద్యను అందిస్తూ 12 రోజుల పాటు ఇంటర్న్‌షిప్ అందించేలా ఏర్పాట్లు చేసింది. దీంతో విద్యార్థులు మరింత ఉత్సాహంగా వృత్తి విద్యను నేర్చుకునేందుకు ముందుకొస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఏడాది నుంచి ఈ కోర్సులను రాష్ట్రవ్యాప్తంగా మరికొన్ని పాఠశాలల్లో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంది. ప్రస్తుతం విశాఖ జిల్లాలోని 19 పాఠశాలల్లో ఇంటర్న్‌షిప్ పేరుతో పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు.

9, 10, 11, 12 తరగతుల విద్యార్థులకు..

వృత్తివిద్యను బోధించడం కోసం కేటాయించిన పాఠశాలల్లో రెండు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాల స్థాయిలో 9, 10, కళాశాల స్థాయిలో 11, 12 తరగతుల విద్యార్థులకు ప్రస్తుతం వృత్తి విద్య శిక్షణను అందిస్తున్నారు. వీరికి ఒకరోజు వార్షిక పరీక్ష నిర్వహిస్తారు. 70 మార్కులకు ప్రాక్టికల్స్, 30 మార్కులు థియరీ ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణులైన వారికి ధ్రువపత్రం అందించనున్నారు. వాటితో కంపెనీల్లో ఉపాధి పొందడానికి ఆస్కారం ఉంటుంది.

చాలా ప్రయోజనకరం..

పాఠశాల స్థాయి నుంచే వృత్తి శిక్షణ ఇవ్వడం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరం. ఇక్కడ పొందిన శిక్షణతో చిన్నచిన్న వర్క్‌షాపుల్లో ఉపాధి పొంది జీవితాన్ని బంగారుబాటగా మార్చుకునే అవకాశం ఉంది. దీనిపై తాము విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తున్నాం. నిత్యం ఈ శిక్షణపై పర్యవేక్షణ చేస్తూ శిక్షకులకు తగు సూచనలు చేస్తున్నాం.
– కె.కాలేషావలి, వృత్తి విద్య శిక్షణ జిల్లా సమన్వయకర్త

ఇప్పటివరకు ఐదు బ్యాచ్‌లకు..



చింతలగ్రహారం పాఠశాల నుంచి ఇప్పటికి ఐదు బ్యాచ్‌లను ఇంటర్న్‌షిప్‌నకు పంపించి శిక్షణ అందించాం. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా 12 రోజులు శిక్షణను పొందారు. వారికి తెలియని విషయాలను ప్రాథమిక అంశాలను వర్క్‌షాపులో నేర్చుకున్నారు. మా పాఠశాలలో ఎలక్ట్రానిక్స్, ఫుడ్‌ప్రాసెసింగ్ కోర్సులలో శిక్షణ అందిస్తున్నాం.
– బురడ ప్రశాంతి, వృత్తివిద్య శిక్షకురాలు, చింతలగ్రహారం జెడ్పీ పాఠశాల

దర్పణం: దిష్టిబొమ్మల్లా కంపోస్టు తయారీ బిన్లు




చెత్తతో ఎరువును తయారు చేసి వాటితో మొక్కలు పెంచడమే లక్ష్యంగా జీవీఎంసీ ప్రారంభించిన డ్రమ్ కంపోస్టు ప్రాజెక్టు మూలకు చేరింది. ప్రతీ కాలనీలో ఒకటి, రెండు డ్రమ్ కంపోస్టు బిన్లను ఏర్పాటు చేసి కాలనీవాసులు తడిచెత్తను అందులో వేసి బాగా కుళ్లిన తరువాత ఎరువుగా తయారు చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. వీటిని ప్రజలు సక్రమంగా వినియోగించకపోవడంతో ఎక్కడికక్కడ దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్ బృందాలు వచ్చినపుడు ప్రజారోగ్య విభాగం అధికారులు ఈ డ్రమ్ములను శుభ్రం చేసి ఎరువును తయారు చేస్తున్నట్టు చూపించడం, వారు వెళ్లిన తర్వాత ఆ ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్టు తయారవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మొక్కలు పెంచేవారితో సమన్వయం చేసుకుని ఈ డ్రమ్ కంపోస్టు బిన్లను వినియోగించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వేపగుంట

కమనీయం.. నరహరి నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య కల్యాణోత్సవం బుధవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు.

అ వీ ఇ వీ

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం



పెందుర్తి, న్యూస్‌టుడే: పులగవానిపాలెం 33/11కేవీ ఉప కేంద్రం పరిధిలోని 11 కేవీ దుర్గానగర్ ఫీడర్‌పై నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, సూర్యానగర్, మర్రిచెట్ల కాలనీ, నల్లక్వారీ, సాయిదివ్య లేఅవుట్, వికలాంగుల కాలనీ, కుమ్మరి కాలనీ, తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని తెలియజేశారు.

పరవాడ మండలంలో..

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలోని పలు గ్రామాలకు గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశపాత్రునిపాలెం, ఎస్సీకాలనీ, శేషాద్రినగర్, స్నేహపురికాలనీ, పి.భోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ తదితర ప్రాంతాలకు సరఫరా ఉండదని వెల్లడించారు.

విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు

పెందుర్తి, న్యూస్‌టుడే: స్థానిక శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులకు బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపల్ తారకేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో క్లోవ్ దంత వైద్యశాల వైద్యురాలు డాక్టర్ ఆరతి సుబ్రహ్మణ్యం, డాక్టర్ కృష్ణచైతన్య పాల్గొని విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. దంత సంరక్షణపై అవగాహన కల్పించారు.

జోన్-8 ఈఈగా చిరంజీవులు



వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-8 ఇంజినీరింగ్ విభాగం ఈఈగా ఎస్.చిరంజీవులు బుధవారం విధుల్లో చేరారు. ఇటీవల నిర్వహించిన బదిలీల్లో భాగంగా జోన్-7 నుంచి ఈయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఈఈ రత్నాకర్‌రెడ్డి యూజీడీ ప్రాజెక్టు విభాగానికి బదిలీ అయ్యారు.

ఖాతాదారుల అభివృద్ధే లక్ష్యంగా సేవలు

సబ్బవరం, న్యూస్‌టుడే: ఖాతాదారుల అభివృద్ధే లక్ష్యంగా తమ బ్యాంక్ పని చేస్తోందని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సీబీఐ) జనరల్ మేనేజర్ ఎస్.నాయక్ అన్నారు. సబ్బవరంలో బ్యాంక్ నూతన శాఖను బుధవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్.నాయక్ మాట్లాడుతూ సెంట్రల్ బ్యాంక్ ప్రారంభించి 114 ఏళ్లు కావస్తోందన్నారు. రూ.6 వేల కోట్ల టర్నోవర్‌తో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా 4500 శాఖలు, అనుబంధంగా 20,500 టచ్ పాయింట్లు ఉన్నాయన్నారు. ఖాతాదారులకు అన్ని రకాల సేవలు అందించడంతో పాటు వివిధ రకాల రుణాలు కూడా ఇస్తున్నామన్నారు. రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన నాణేలను కొంతమంది తిరస్కరించడం జరుగుతోందని, తప్పుడు మాధ్యమాల్లో వచ్చే ఇలాంటి ప్రకటనలు నమ్మవద్దని సూచించారు. రూ.5, రూ.10 నాణేలను ఎవరూ తిరస్కరించవద్దని కోరారు. ఈ సందర్భంగా ఖాతాదారులు తమ ఖాతాల నుంచి ఉపసంహరించిన మొత్తానికి రూ.10 నాణేలను అందించారు. రీజనల్ మేనేజర్లు మూర్తి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న సీబీఐ జనరల్ మేనేజర్ ఎస్.నాయక్

అధునాతన పద్ధతులతో అధిక దిగుబడి

దేవాడ(పరవాడ), న్యూస్‌టుడే: రైతులంతా అధునాతన పద్ధతుల్లో వ్యవసాయం చేసి పెట్టుబడులు తగ్గించుకుని మంచి దిగుబడి సాధించాలని విశాఖ అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ సూపర్‌వైజర్ ఎం.ధనలక్ష్మి, పెదగంట్యాడ ఏవో శశికళ పేర్కొన్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధి దేవాడలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులు పండిస్తున్న వరి సాగును పరిశీలించారు. పంట పొట్టదశలో ఉందని సరైన సస్య రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం రైతులు పలు సమస్యలను అధికారులకు వివరించారు. రాయితీపై విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, రైతు భరోసా సొమ్ము ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అన్ని పథకాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వార్డు తెదేపా అధ్యక్షుడు పాల అచ్చిల నాయుడు, దేవాడ పశువైద్యాధికారి రాజేశ్, నాయకులు పాల నగేశ్, చుక్క వెంకన్న, కాకి నారాయణ, రేలంగి అప్పారావు, అత్తిలి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



దేవాడలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు

జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో వ్యర్థాల తొలగింపు



కాలనీలోని రహదారిపై చెత్తను తొలగించి శుభ్రం చేసిన దృశ్యం

ఈనాడు కథనానికి స్పందన

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం గొర్లెవానిపాలెం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో పేరుకుపోయిన వ్యర్థాలను ఎట్టకేలకు బుధవారం తొలగించారు. గత కొద్దిరోజులుగా కాలనీలోని రహదారుల వెంబడి పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయి పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. విష పురుగుల సంచారం పెరిగింది. ఇటీవల కురిసిన వర్షాలకు వ్యర్థాలు కుళ్లి తీవ్ర దుర్వాసన రావడంతో పాటు దోమల బెడదతో కాలనీవాసులు ఇక్కట్లు పడేవారు. ఇక్కడి సమస్యపై ‘క్షీణించిన పారిశుధ్యం’ శీర్షికతో ఈ నెల 15న ‘ఈనాడు’లో ప్రచురించిన కథనానికి ఈవోపీఆర్డీ ధర్మారావు, పంచాయతీ అధికారులు స్పందించారు. పేరుకుపోయిన చెత్తను యంత్రాలతో తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. రహదారులను శుభ్రం చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైళ్లు లేక.. దిక్కుతోచక..!

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: దానా తుపాను కారణంగా హౌవ్‌డా, షాలిమార్, భువనేశ్వర్ వైపు వెళ్లే రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. దీంతో పాటు పలు రైళ్ల రాకపోకల్లో తీవ్ర అంతరాయం ఏర్పడి ఆలస్యంగా నడుస్తున్నాయి. బుధవారం నుంచి రైళ్లు రద్దయినప్పటికీ అంతకు ముందు బయలుదేరినవి ఒక్కొక్కటిగా విశాఖ చేరుకుంటున్నాయి. అయితే కనెక్టింగ్ రైళ్లు లేకపోవడంతో పెద్దఎత్తున ప్రయాణికులు రైలు నిలయంలో పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గమ్యస్థానానికి చేరే దారి తెలియక ఆందోళన చెంతున్నారు. నిరీక్షిస్తున్న వారితో స్టేషన్ పరిసరాలు రద్దీగా మారాయి. మరో పక్క అరకొరగా నడస్తున్న రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి.



రైళ్ల రద్దుతో స్టేషన్‌లో పడిగాపులు

మద్యం మత్తులో పోలీసులపై దౌర్జన్యం

గాజువాక, న్యూస్‌టుడే : అతిగా మద్యం తాగిన వ్యక్తి... పోలీసులపై దౌర్జన్యం చేసి, చేతి వేలు కొరికేసిన ఘటన బుధవారం రాత్రి విశాఖపట్నం గాజువాకలో చోటు చేసుకుంది. ఆ వివరాలు.. గాజువాక రాజీవ్‌మార్గ్ కూడలి వద్ద పోలీసులు డ్రంకన్ డ్రైవ్ కేసులు రాస్తున్నారు. హోమ్‌గార్డు ప్రసాద్, మొబైల్ కానిస్టేబుల్ రాజశేఖర్ ఆల్కామీటర్లతో తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో అతిగా మద్యం తాగి బైక్‌పై వస్తున్న అమర్‌నగర్‌కు చెందిన ఆర్.శ్రీను(30)ను ఆపి తనిఖీ చేసేందుకు ప్రయత్నించారు. తననే అడ్డుకుంటారా..? అంటూ శ్రీను గొడవ చేశాడు. అంతటితో ఆగకుండా కానిస్టేబుల్ రాజశేఖర్ చేతి వేలిని కొరికేశాడు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని నిందితుడిని గాజువాక పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.



ట్రాఫిక్ సిబ్బందితో వాదిస్తున్న శ్రీను



కానిస్టేబుల్ వేలిపై గాయం

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఉపాధ్యాయులతో అర్హత సాధించిన విద్యార్థినులు

వేపగుంట, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు వేపగుంట జెడ్పీ పాఠశాల విద్యార్థినులు నలుగురు ఎంపికయ్యారు. అనకాపల్లి జిల్లా కూండ్రంలో ఈనెల 21న నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన 10వ తరగతి బాలికలు లావణ్య, గంగోత్రి, 9, 8వ తరగతుల విద్యార్థినులు ధరణి, గౌరి పాల్గొని ప్రతిభ చూపారు. దీంతో ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరిని ఎంపిక చేసినట్లు ప్రధాన, వ్యాయామ ఉపాధ్యాయులు మహేశ్వరరావు, వెంకటరావు, యామిని తెలిపారు. ఎంపికైన బాలికలను బుధవారం పాఠశాలలో అభినందించారు.

పడకేసిన దీపాలు.. పట్టించుకోని అధికారులు

దేశపాత్రునిపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: వందలాది భారీ వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే రహదారిలోని హైమాస్టు వీధి దీపాలు రాత్రుళ్లు వెలగక చీకటి కమ్మేయడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి విష పురుగులు, కుక్కల బెడద ఎక్కువగా ఉండటంతో పాటు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నామని భయాందోళన చెందుతున్నారు. జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెం రైల్వే వంతెన కూడలి, బైక్ మెకానిక్ షెడ్ ప్రాంతాల్లో హైమాస్టు దీపాలు పడకేశాయి. చాలారోజుల నుంచి వెలగకపోయినా పట్టించుకునే వారే కరవయ్యారని స్థానికులు వాపోతున్నారు. రాత్రయితే అంధకారం రాజ్యమేలుతోందని, తరచూ ప్రమాదాల బారిన పడుతున్నామని పాదచారులు, సైకిళ్లపై వెళ్లే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి దీపాలను బాగుచేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.





దేశపాత్రునిపాలెం రైల్వే వంతెన కూడలిలో, మెకానిక్ షెడ్ వద్ద మరమ్మతులకు గురైన హైమాస్టు దీపాలు

తప్పుల సవరణకు అవకాశం

సబ్బవరం, న్యూస్‌టుడే: రీసర్వేలో నమోదైన తప్పులను సవరించుకునేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు రైతులకు చక్కని అవకాశమని సబ్బవరం తహసీల్దారు బి.చిన్నికృష్ణ అన్నారు. గొట్టివాడలో బుధవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారుల చుట్టూ పదేపదే తిరగకుండా గ్రామంలోనే దరఖాస్తులు స్వీకరించి తప్పులను సవరించే కార్యక్రమం జరుగుతుందన్నారు. గొట్టివాడ గ్రామంలో మొత్తం భూమి 663.87 ఎకరాలు ఉండగా దీంట్లో 192.06 ఎకరాలు బంజరు భూమిగా నమోదయ్యిందన్నారు. జిరాయితీ భూమి 471.81 ఎకరాలుగా గుర్తించామన్నారు. భూ ఖాతా నెంబర్లు 603 ఉన్నాయన్నారు. 3285 మందికి ఎల్‌పీఎంలు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్లు ఎల్.అప్పారావు, వీఎల్ మాతాప్రసాద్, మోహన్, రామఅప్పారావు, బి.రాంబాబు, వీఆర్వో కె.వాత్సల్య, సర్పంచి సాలాపు మీన, బొండా సత్యారావు, సాలాపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దారు చిన్నికృష్ణ

పరవాడలో 131 అర్జీలు



రెవెన్యూ సభలో పాల్గొన్న అధికారులు, నాయకులు, గ్రామస్థులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సామాజిక భవనం వద్ద బుధవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌నాయుడు, రీసర్వే డీటీ సురేశ్, మండల సర్వేయర్ శ్రీనివాస్ పాల్గొని భూ సమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. పరవాడ రెవెన్యూలోని భూముల హద్దులు, పేర్లు తప్పుగా పడ్డాయని వాటిని సరి చేయడంతో పాటు గెడ్డవాగులు, ప్రభుత్వ భూములు, పంట కాలువలు, కొండల ఆక్రమణలను అడ్డుకోవాలని పలువురు ఫిర్యాదు చేశారు. మొత్తం 131 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి, సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, మాజీ సర్పంచి చుక్క రామునాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సామాన్యుడికి భారంగా నిత్యావసరాల ధరలు

సుజాతనగర్(పెందుర్తి), న్యూస్‌టుడే: రాష్ట్రంలో నిత్యావసరాల ధరలు సామాన్యుడికి భారంగా మారాయని సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలపై బుధవారం సుజాతనగర్ కూడలిలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు రాయితీలు కల్పించడంలో మునిగిపోయి సామాన్యులను గాలికొదిలేశారని ఆరోపించారు. తక్షణమే ధరల నియంత్రణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యుడు వై.రాంబాబు, సభ్యులు రాము, దుర్గారావు, రామారావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.



సుజాతనగర్ కూడలిలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

నరకానికి నకళ్లు..

అధ్వానంగా గ్రామీణ రహదారులు



సబ్బవరం - నరవ రహదారిలో ప్రమాదకర గుంతలు

సబ్బవరం, న్యూస్‌టుడే: కొన్నేళ్ల క్రితం నిర్మించిన రహదారులు నిర్వహణ లేక అధ్వానంగా తయారయ్యాయి. గుంత పక్కన గుంత ఏర్పడి నరకానికి నకళ్లుగా మారాయి. సబ్బవరం మండలంలోని గ్రామీణ ప్రాంతాల రోడ్లు శిథిలమై ప్రయాణికులకు పగలే చుక్కలు చూపిస్తున్నాయి. సబ్బవరం - నరవ, సబ్బవరం - అంతకాపల్లి, అమృతపురం రోడ్లలో అడుగడుగునా భారీ గుంతలు ఏర్పడటంతో పరిసర గ్రామాల ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. వంగలి రామాలయం వద్దనున్న గుంతల్లో వర్షపు నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. మరో గత్యంతరం లేక ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నామని పెట్రో, మారిటైం యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బురద కారణంగా తరచూ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. గొట్టివాడ నుంచి వంగలిని కలిపే రోడ్డు మరీ దారుణంగా తయారైంది. వర్షం కురిసినప్పుడల్లా సమీపంలోని సూదికొండ పైనుంచి వచ్చే వరద నేరుగా ఈ రహదారి మీదుగా ప్రవహించడంతో కోతకు గురవుతోంది. అధికారులు వెంటనే స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



వంగలిలో రోడ్డుపై నిలిచిన నీరు